Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

అక్టోబర్ 15, 2006

గున్యా పోతే డెంగ్యూ వచ్చె

హ్యాపీబర్త్‌డే

(15.10.2006 నుంచి
21.10.2006 వరకు)

ఎ. సుదర్శన్
1సం॥, అక్టోబర్-15
దాక్షాయని-సుబ్రమణ్యం
రామపురం-చిత్తూరు

జి. సాయి తేజ (బబ్లూ)
6సం॥, అక్టోబర్-15
సునీత-జయచందర్
శంకర్‌పల్లి-రంగారెడ్డి

సురేంద్రకుమార్
5సం॥, అక్టోబర్-16
ఏసమ్మ-యేసేలు
నంబూరు-గుంటూరు

ఎం. తిరోజ్‌వర్మ
2సం॥, అక్టోబర్-16
అమృత-నారాయణ
మాధవానిపల్లి-మ॥నగర్

బి. కిషోర్
7సం॥, అక్టోబర్, 9
బి.లక్ష్మి - బి.రాజు
పెలికిచెర్ల-వెస్ట్‌గోదావరి

వి.నవ్యక
1సం॥, అక్టోబర్-2005
భాగ్యలక్ష్మి-పాపయ్య
వెంకటేశ్వరనగర్-ప్రకాశం

జి. సౌజన్య
6సం॥, అక్టోబర్-20
పద్మావతి-నారాయణ
సుందరయ్యనగర్-ఖమ్మం

పెద్దలను గౌరవించడం మానేశారు

మన అతిథి గురించి...

పేరు	:	మంగ శివలింగం గౌడ్ (ఎం.ఎస్. గౌడ్)
పుట్టింది	:	12.04.1943, మెదక్ జిల్లా
కుటుంబం	:	భార్య, కుమార్తె, కుమారుడు
విద్య	:	బిడిఎస్, ఎండిఎస్.
వృత్తి	:	ఆర్మీ దంత వైద్యకళాశాల ప్రిన్సిపల్, మన రాష్ట్ర గవర్నర్‌కు గౌరవ దంత వైద్యులు
ఆదర్శం	:	తల్లిదండ్రులు, అన్నయ్య
నచ్చిన పుస్తకం	:	మహాత్మా గాంధీ రాసిన మై ఎక్స్‌పరిమెంట్ విత్ ట్రూత్
లక్ష్యం	:	దంత సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడం.
బలం	:	అనుకున్నదాన్ని సాధించడానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో కృషిచేయడం
బలహీనత	:	అందరినీ నమ్మడం
ఇష్టాయిష్టాలు	:	స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, చెస్, పుస్తక పఠనం (చరిత్ర)

సమాజంలో నైతిక విలువలు రోజురోజుకు దిగజారుతున్నాయి. దీన్ని ఎలా నియంత్రించాలనేది సమస్యగా తయారైంది. కష్టపడే తత్వం కొరవడి 'ఈజీ మనీ' కోసం వెంపర్లాడడం మొదలైంది. ఎంతో ఘన చరిత్ర ఉన్న మన సంస్కృతి, సంప్రదాయాలను వదిలి యువత పాశ్చాత్య సంస్కృతిని అలవర్చుకోవడం దురదృష్టకరం. ఫలితంగా పెద్దలను గౌరవించడం మానేశారు. కష్టపడి పనిచేసి, అభివృద్ధి చెందడానికి చైనాను ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఎందుకంటే అక్కడ రోజుకు కనీసం పదహారు గంటలకు మించి పనిచేస్తారు. అందుకే చైనా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. చైనా నుంచి మనం ఎన్నో నేర్చుకోవాలి. చేస్తున్న పనిపట్ల గౌరవం ఉండాలి. ఇది కొరవడితే విజయం సిద్ధించదు. విజయానికి దగ్గరి దారులు లేవు. దగ్గరి దారిలో విజయం సాధించినవాళ్లకు భవిష్యత్తులో కష్టాలు ఎదురవుతాయి. యువత కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలి.

MSgoud

ఈ సంచికలో...

టపా	...	2
సెన్సూ కామన్ సెన్సు	...	4
సలహాలు	...	5
ఇంటి సంగతులు	...	6
క్యాంపస్ ఛాట్	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...

ఇలా వుందామా... 7

రాత్రికి రాత్రే...!



సీరియల్ 8

తెలుగుగడ్డ

కథ 18

గ్యాసైపోయిందోచ్

అవీ...ఇవీ ...	...	21
మనసా... తెలుసా	...	22
విజ్ఞాన వీచిక	...	23
కొత్త పుస్తకాలు	...	24

దర్పణం

అక్టోబర్ 1, 2006 స్నేహ సంచికలోని కవర్‌స్టోరీ 'కొత్త సంగీత లోకం ఎఫ్ ఎం' ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. చాలా ఆసక్తిగా ఉంది. మనసా తెలుసా శీర్షిక మానసిక సమస్యలకు దర్పణం పట్టేలా వుంది. విజ్ఞాన వీచికలో అంతరిక్షంలో అభివృద్ధికి సంబంధించిన సరికొత్త విషయాలు ఇవ్వడం బాగుంది. మొత్తం మీద స్నేహ ఓ మినీ వారపత్రిక చదువుతున్న అనుభూతిని కలిగిస్తోంది.

- భాగ్యరాజ్, , పొన్కల్, ఆదిలాబాద్.

విలువలు

యువత పాశ్చాత్యపోకడలు పోతున్నారని, ఆరు 'సి'లు అదుపులో ఉంచుకోవాలంటూ మా నెల్లూరు వాసి బి.వి. పట్టాభిరామ్ చెప్పినతీరు చాలా సంతోషం కలిగించింది. నిజమే, విలువలను కోల్పోతే సమాజంలో అశాంతి పెరుగుతుంది. కార్టూన్లు, బాగుంటున్నాయి. లతా మంగేష్కర్ పుట్టినరోజు సందర్భంగా అందించిన వ్యాసం ఆసక్తికరంగా వుంది. వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాసిన చిన్న కథ బాగుంది. న్యాయ సలహాలు విజ్ఞానదాయకంగా వున్నాయి.

వాస్తు రామచంద్రరావు,
రాంజీనగర్, నెల్లూరు

ఆకట్టుకున్నాయి

ప్రముఖ సినీ నటి శ్రీమతి జమున చెప్పినట్లు వీధి నాటికలు, బుర్రకథలు, హరికథలు, వగైరా కళాకారులు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్నారు. సామాజిక వికాసానికి కళలు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా గ్రామ సీమల్లో జనం విజ్ఞానవంతులు కావడానికి వీధి కళాకారుల ప్రదర్శనలు ఏడాది పొడవున తప్పక వుండాలి. పనికి ఆహార పథకం వలె కనీసం మూడు నెలలకు ఒక పర్యాయం కళాకారులకు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఉపాధిని కల్పించాలి! మొత్తానికి ఈ వారం సినిమా కబుర్లు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

జె. సుధాకర్ రావు, కాకినాడ,
తూ.గో జిల్లా.

బాగుంది

'ఆరోగ్యం' శీర్షికలో పిల్లల్లో తరచూ వచ్చే నీళ్ల విరేచనాలు, నివారణా మార్గాల గురించి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.సుదర్శన్‌రెడ్డి వివరించిన తీరుబాగుంది. నీళ్ల విరేచనాలు అయినప్పుడు పిల్లలకు ఎటువంటి ఆహారం ఇవ్వాలి, అలాంటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి మొదలైన అంశాలు తెలియజేసినందుకు కృతజ్ఞతలు.

పి. అప్పారావు,
విజయనగరం.

ధన్యవాదాలు

'విజ్ఞానవీచిక'ద్వారా ప్రతి వారమూ ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటున్నాం. 'రుచి'లోని వంటకాలు బాగున్నాయి. హ్యాపీ బర్త్‌డే శీర్షికలో మా చిన్నారుల ఫొటోలు రంగుల్లో చూసుకోవడం సంతోషదాయకంగా వుంది. ఇలా అందిస్తున్నందుకు ధన్యవాదాలు.

రవళి, ఖమ్మం.

మనకు తెలిసిందే...

'ఇలా ఉందామా' శీర్షికలో వృద్ధుల గురించి చక్కగా రాశారు. రమణకు ఓ పెద్ద మల్టీనేషనల్ కంపెనీలో ఆఫర్ వచ్చినప్పుడు తల్లిదండ్రులు తమ బాధను విడమర్చి చెప్పినా అతను అర్థంచేసుకోలేదు. డబ్బు సంపాదనలో పడి ఎందరో పిల్లలు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం మనకు తెలిసిందే.

కావ్య,
బాలాపూర్

సలహాలు

అక్రమ సంబంధాల విషయమై హైకోర్టు న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహారావు ఇచ్చిన సలహా బాగుంది. కేసుపెడితే ఇబ్బందులు వస్తాయేమోనని కుమిలిపోయే వారికి ఓ మంచి సలహా ఇచ్చారు. ఇది నిస్సందేహంగా మరెందరికో పనికొస్తుంది.

ఆనంద్, శ్రీకాకుళం జిల్లా

బాగున్నాయి

'స్నేహ'లోని అన్నీ శీర్షికలు బాగున్నాయి. కార్టూన్లు, జోకులు మరిన్ని పెంచగలరు. ప్రతి వారం నెలలో ఏదో ఒక స్పెషల్‌డే ఉంటుంది కదా. ఆరోజుకు సంబంధించి ఒక ప్రత్యేక శీర్షిక ఇస్తే బాగుంటుందేమో. కవర్ స్టోరీ ఎన్నో విషయాలను తెలియజేస్తూ ఆసక్తికరంగా సాగింది. అయితే ఎఫ్.ఎం.లలో ఉన్న అతిని కూడా ప్రస్తావిస్తే మరింత బాగుండేది.

మధు హైదరాబాద్

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

రూ. 150/-కే ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

3881

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

...............: Pincode

సెన్సూ కామన్ సెన్సు

పరామర్శా? పర విమర్శా?

కె.నిర్మల

ఈమధ్య మా బాబాయి కూతురి ఆరోగ్యం బాగోలేదని తెలిసి చూడటానికి వెళ్లాను. అక్కడ ఒకావిడ చేతులు తిప్పుకుంటూ మాట్లాడుతోంది. నేనెళ్లేసరికి "ఇలాంటి వ్యాధే మా మేనత్తకూతురికొస్తే వైద్యం చేయించారు. అదేం మాయరోగమో తెలీదుగానీ వాళ్లకు డబ్బా బోలెడంత ఖర్చయింది, మనిషీ దక్కలేదు. ఇప్పుడు అన్నిరకాల టెస్టులూ చేయించిన తర్వాతే వ్యాధిని నిర్ధారిస్తారు. పూర్వమైతే నాడి చూసి రోగం చెప్పేసే డాక్టర్లుండేవారట. అసలీ డాక్టరు సరైన వైద్యం చేస్తాడో, లేదో? ఈ డాక్టరెలాంటివాడో, అతని హస్తవాసెల-ంటిం ముందు కనుక్కోండి. డబ్బు పోయినా ఫలితం దక్కాలిగా...!" అంటూ వారికి 'పిరికి'మందును నూరిపోసి భయాన్ని, దిగులునూ రెట్టింపు చేస్తోంది.

ఇదసలు పరామర్శేనా? అవతలివారికి ధైర్యం చెప్పే మాటలా ఇవి? అనారోగ్యంవల్ల దిగులుపడుతూంటే, అగ్నిలో ఆజ్యం పోసినట్లు ఇలాగా మాట్లాడటం?

అనారోగ్యంతో బాధపడే వ్యక్తిని పరామర్శించేందుకు వెళ్లినప్పుడు "ఇవాళ వైద్యరంగం ఎంతో పురోగమించింది. ఎటువంటి వ్యాధినైనా తగ్గించే ఎన్నో మందులున్నాయి. డాక్టర్లు సరైన చికిత్సచేసి మిమ్మల్ని ఆరోగ్యవంతుల్ని చేస్తారు. ఈ రోజుల్లో ఎలాంటి అనారోగ్యానికైనా బెంగపడాల్సిన పనిలేదు" అని చెప్పినట్లయితే ఆ మాటలు నిజంగా చక్కని టానిక్‌లా పనిచేయవూ?!

❄❄❄

ఓ విద్యార్థి పరీక్ష తప్పి డీలా పడిపోతే "మొదటి నుంచీ పుస్తకం ముట్టకపోతే పాసవుతారా? చదువుమీద శ్రద్ధ ఉన్నవాళ్ళు చక్కగా చదువుకుని పైక్లాసులకు వెళ్లిపోతుంటే, పాపం... నీకు నిజంగా అవమానమే మరి. పరీక్ష తప్పాడని ఆ రెండో సందులో వుండే సీతమ్మగారి అబ్బాయి ఇంట్లోంచి పారిపోయాడట. వెంకట్రావుగారమ్మాయి పరీక్ష తప్పానన్న బాధతో పురుగుల మందు తాగేసిందట. అటువంటి పిచ్చి పనులేవీ నువ్వు చేయబోకు" అన్న పరామర్శ సెన్సుండి చేసినట్లా? ఇలా మాట్లాడి ఒకపక్క బాధపడ్తోన్నవారి మనసులో అనవసరపు ఆలోచనలు రేకెత్తించడం ఎంతవరకు సబబు? ఇటువంటి మాటలు కామన్‌సెన్సు ఉన్నవారెవరూ చెప్పరు. పరీక్ష తప్పినందుకు బాధపడే విద్యార్థికి ధైర్యానివ్వాలి. ఇవాల్టి ఓటమిని రేపటి విజయంగా మార్చుకోవాలని చెప్పాలి. ఈసారి పరీక్షలో బాగా చదివి మంచి మార్కులతో పాసవ్వాలని ప్రోత్సహించాలి. ఆ విద్యార్థిలో చదువుపట్ల ఉత్సాహాన్ని, ఆసక్తిని, పట్టుదలనూ పెంచాలి. సెన్సుతో చేసే పరామర్శంటే అది.

భర్త చనిపోయిన ఓ వృద్ధురాలు బాధపడుతుంటే, "పాపం... మీ నెత్తిమీద గొడుగు పోయింది. 'భర్త రాజ్యం తన రాజ్యం, బిడ్డల రాజ్యం పరాయి రాజ్యం' అన్న సామెత ఉందిగదా...? చావలేక బిడ్డల అజమాయిషీలో బతకటమే గానీ కొడుకులు సవ్యంగా చూస్తారా? వారి అదుపాజ్ఞల్లో ఓమూల ఒదిగి ఉండాల్సిందే...!" లాంటి మాటలతో పరామర్శపేరిట బతుకుపట్ల భయం ఏర్పడేలా చేస్తారు కొందరు. ఇదేం పరామర్శ? పరామర్శంటే అర్థం తెలీనివారూ... పరామర్శెలాచేయాలో తెలీనివారూ... అసలు పరామర్శచేయకుండా ఉండటమే మేలు.

ఒక అమ్మాయి ఒక యువకుని ప్రేమించి పెద్దలు ఒప్పుకోకపోవడంతో, ధైర్యంగా రిజిష్టర్ మ్యారేజీ చేసుకుని అతని వెంటెళ్లిపోయింది. ఆమె తల్లిదండ్రులు కూతురు చేసిన పనిని అవమానంగా భావిస్తూ కుంగిపోతున్నారు. ఆవార్త తెలిసిన పక్కింటామె వారిని పరామర్శించడానికి వెళ్లి "ఈ ప్రేమేంటో... ఇంట్లోంచి లేచిపోవడమేమిటో... ఇన్నాళ్లూ పెంచి పెద్దచేసి, తన బాగోగులూ, శ్రేయస్సూ చూసిన తల్లిదండ్రుల పరువును గంగలో కలిపి ఎవడితోనో వెళ్లిపోవడమేమైనా బాగుందా...! ఈ ప్రేమలు జీవితాంతం నిలుస్తాయా? ప్రేమించినవాడు మోసగాడైతేనో... ఇక ఆ పిల్ల గతి అధోగతి కాదూ?! మొన్నామధ్య ఓ దినపత్రికలో చదివా... ప్రేమించానని ఓ అమ్మాయిని ఇంట్లోంచి లేవదీసుకుపోయి, బ్రోతల్‌హౌస్‌లో అమ్మేశాడట ఓ మోసగాడు. ఆడపిల్ల బతుకు అరిటాకులాంటిదని మర్చిపోతే ఎలా?" అంటూ ఆ తల్లిదండ్రుల గుండె బరువునూ, బాధనూ పరామర్శపేరుతో మరింత పెంచిందావిడ. ఇలా ఎదుటివారి గుండెకు గాయం చేయడాన్ని పరామర్శ అంటారా?!

పరామర్శ చేసేటప్పుడు అవతలివారి మనస్తత్వాన్నీ, పరిస్థితినీ దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలి. పరామర్శంటే పన్నీటి చిలకరింపులా ఉండాలేగానీ ముల్లులా బాధించకూడదు. ఇదేవిధంగా, జీవితంలో ఓటమిపాలైన వారిని పరామర్శపేరుతో హేళన చేయటం... వారి పొరపాట్లను ఎత్తిచూపటం... ఇంగితజ్ఞానం లేకుండా చేసేపని. సెన్సున్నవారు వారి మనసులో ధైర్యాన్ని నింపుతారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను ప్రేరేపిస్తారు. వారి ఓటమిని రేపటి గెలుపుకు బాటగా ప్రోత్సహిస్తారు. వారిలో నిరాశను, అధైర్యాన్ని, నిరుత్సాహాన్ని, బాధను తొలగిస్తారు.

మనిషన్న తర్వాత సమస్యలు, బాధలు, కష్టాలు, అనారోగ్యాలు రాకుండా ఉండవు. అటువంటి దిగులుతో కుంగిపోతున్నప్పుడు తోటివారు వారి బాధను పంచుకుంటూ వారికి ఊరడింపును కలిగించాలి. ఆ బాధను తట్టుకోగల్గిన మనోధైర్యాన్ని అందించాలి. అటువంటి మాటలనే పరామర్శలంటారు. కొంతమంది పరామర్శపేరుతో ఎదుటివారికి మానసిక అశాంతిని కలిగిస్తున్న సంగతి గ్రహించుకోరు.

ఎదుటివారు అశాంతితో బాధపడుతున్నప్పుడు వారిని పరామర్శ పేరిట మానసికంగా కుంగదీయటం మానవత్వం కాదు. వీలైతే వారికి ఆసరా అందించాలి. మనోధైర్యాన్ని చేకూర్చాలి. లేదంటే పరామర్శ చేయకపోడటమే మంచిది.

బాధ్యతలే తప్ప హక్కులుండవా?

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది

శ్రీ జి.ఎల్.నరసింహారావు

తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా:
ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం,
స్ట్రీట్ నెంబర్: 1,
అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

నా భర్త షేక్ మహబూబ్ (లేట్) తన మొదటి భార్యకు పిల్లలు కలగనందున 15 సంవత్సరాల తరువాత నన్ను రెండవ వివాహం చేసుకున్నారు. నాకు ముగ్గురు పిల్లలు కలిగారు. 1. షేక్ రషీద్ కుమార్తె (1987), 2. షేక్ బాజీ కుమారుడు (1991), 3. షేక్ షమీమ్ కుమార్తె (1994)

నా భర్త రైల్వేలో కేర్‌టేకర్‌గా పనిచేస్తూ 13.10.99న చనిపోయారు. జిల్లా కోర్టువారు ఫ్యామిలీ పెన్షన్‌ను మా ఇద్దరికీ (భార్యలకు) ఇతర పి.ఎఫ్, గ్రాట్యుటీ వగైరాలు మా పిల్లలు ముగ్గురికి చెందేటట్లుగా తీర్పు ఇచ్చారు. అయితే మా పెద్ద అమ్మాయికి మాత్రమే డబ్బు ఇచ్చి మిగిలిన ఇద్దరికీ మైనర్‌లు అయినందున డబ్బు ఇవ్వటానికి వీల్లేదని రైల్వేవారు చెప్పారు. ముస్లిం 'లా' ప్రకారం తండ్రి లేకపోతే తాత గార్డియన్ అవుతాడని, తల్లికి ఎలాంటి అర్హతా లేదని వారన్నారు. అయితే వాళ్ళ తాతగారు (మా మామగారు) అంత క్రితమే చనిపోయారు.

తండ్రి లేకపోయినా కూలీనాలీ చేసి పిల్లలను పోషించి చదివిస్తున్న నాకు బాధ్యతలే తప్ప హక్కులుండవా? పిల్లలకు గార్డియన్‌గా ఉండి ఆ వచ్చే డబ్బును వాళ్ళిద్దరి మైనారిటీ తీరేవరకు ఏదైనా జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేసుకునే వీలుందా?

నా గార్డియన్‌షిప్‌ను అంగీకరించనట్లయితే రైల్వేవాళ్ళు మైనర్లయిన నా ఇద్దరు పిల్లలకు చెందేటట్లు ఆ డబ్బును ఏదైనా ప్రభుత్వ సంస్థలో డిపాజిట్ చేయవచ్చు కదాని అడిగినా రైల్వేవారు అంగీకరించటం లేదు. షేక్ బాజీకి మరో మూడు సంవత్సరాలకు, షేక్ షమీమ్‌కు మరో ఏడు సంవత్సరాలకు గాని మైనారిటీ నిండదు. ఈ పరిస్థితులలో వాళ్ళకు రావలసిన 1,35,000/- రూపాయి వడ్డీ చొప్పున లెక్క వేసినా మరో 80,000/- అదనంగా వడ్డీ రూపంలో వస్తుంది. దాన్ని మేం నష్టపోవాల్సిన పరిస్థితి కన్పిస్తోంది. దయచేసి ఆర్థికంగా బలహీనులం కాబట్టి తక్కువ ఖర్చుతో మాకు త్వరలో న్యాయం జరిగేట్లు సలహా ఇవ్వగలరని ఆశిస్తున్నాను.

షేక్ బషీరున్, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా.

మీరు చెప్పినట్లు తీర్పు వచ్చివుంటే అదే కోర్టులో మైనార్టీ పిల్లల పేరుమీద బ్యాంకులో ఫిక్స్‌డ్ చేయమనే తీర్పు వచ్చి ఉంటుంది. తీర్పునుబట్టి రైల్వే వారు మీకు డబ్బు ఇచ్చిఉంటారు. కాని మీరు అదే ఫామిలీ కోర్టులో ఆ మైనరు పిల్లల తరపున ఎక్స్‌క్యూషన్ పిటిషన్ (ఇ.పి) ఫైలు చేయండి. పిల్లలకు చెందాల్సిన డబ్బును పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ చేయమనే ఏ కోర్టు అయినా తీర్పునిస్తుంది. రైల్వే వారు చెప్పినట్లు మేజర్స్ అయితేనే ఇస్తామనేది బహుశ తప్పు కావచ్చును. మీరు తీర్పు సారాంశాన్ని పూర్తిగా పరిశీలించండి. ముస్లీం లా అయినా మైనరు పిల్లలకు గార్డియన్‌గా తల్లిదండ్రులనే సూచిస్తుంది. వీరు లేనట్లయితేనే తాతగారు, గార్డియన్‌గా ఉంటారు. కనుక మీ విషయంలో మైనరు పిల్లలకు మీరే గార్డియన్‌గా ఉండవచ్చు.





ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

మగబుద్ధి

కాలింగ్ బెల్ మోగింది. షీలా వెళ్లి తలుపుతీసింది. ఎదురుగా కాస్త వయసు మళ్లిన మనిషి, ఎడమ చెయ్యి గోడకి తాటించి నిలబడి వున్నాడు.

"ఎవరూ?" అంది షీలా.

"నేను కొత్తగా వచ్చిన వాచ్‌మన్ నమ్మా" అన్నాడు. ఆమె కాస్త ఆశ్చర్యంగా అతన్ని పై నుంచి కింది వరకు పరీక్షగా చూసింది. ఈమె చూస్తోందని గమనించి గోడనానుకున్న ఎడం చెయ్యి తీసేసి మామూలుగా నిలబడ్డానికి ప్రయత్నం చేశాడు. అయినా అతను నిటారుగా నిల్చోలేక పోతున్నాడని ఆమెకనిపించింది.

"పేరేమిటి?" అంది.

"రామదాసు" అన్నాడు. ఇంకానయం 'తానీషా' అన్లేదు అనుకుని "ప్రెసిడెంట్ నిన్ను చూశారా?" అంది. "సారే నన్ను అప్పాయింట్ చేశారమ్మా" అన్నాడు. "సర్లే! పని చూసుకో" అంది. అతను నెమ్మదిగా కదలివెళ్లిపోయాడు.

ఈ సెంట్రీ పని మహావిసుగ్గానూ, ఇబ్బంది గానూవుంది. అయినా కొన్నాళ్లు తప్పేట్టులేదు. ప్రెసిడెంట్‌తో ఫోనులో మాట్లాడింది.

"అసలెవరూ దొరకలేదు మేడమ్! ఏం చేద్దాం- వీడు ఫిట్ కాడని తెలుసు. కానీ ఎవడో ఒకడు. అసలు ఎవడూ లేడంటే మనల్ని పీకేస్తారు" అని పేట్టేశాడు ఫోను.

రామదాసు గబుక్కున లేచి నిలబడలేడు. వేగంగా నడవలేడు. కానీ కంఠం మాత్రం ఖంగున మోగుతుంది. అపార్టుమెంట్‌లో అయిదవ ఫ్లోర్‌వరకూ కూడా వినిపిస్తుంది. మరొక మనిషి దొరికే వరకు తప్పదని కాలక్షేపం చేస్తున్నారు. అతని గొంతుతో కొందర్ని ఆకర్షించాడు రామదాసు.

అయితే వారం తిరిగేసరికి రామదాసు కొడుకు ప్రత్యక్ష మయ్యాడు. వాడు టెన్త్‌క్లాస్ తప్పిన ఇరవై ఏళ్ల కుర్రాడు. వాడు రాత్రి వుండేట్టు, పగలు ఈ రామభక్తుడు పూట గడిపేట్టు ఒప్పందం కుదిరింది. అపార్టుమెంట్‌లో అందరికీ అసంతృప్తిగానేవుంది. నలభై ఫ్లాట్లున్న ఈ బిల్డింగ్‌కి సరైన సెక్యూర్టీ లేదని అందరూ మహా చిరాకుపడుతున్నారు. కానీ సరైన మనిషిని ఎవరూ వెదికి పట్టుకోలేకపోతున్నారు. రామదాసు మిలటరీలో రిటైరై ఇరవై ఏళ్లు దాటింది.

ఇచ్చే కొద్ది జీతానికి మేలైన మనిషి కావాలంటే కుదరటంలేదు. ఎవరూ మెయిన్‌టెనెన్స్ డబ్బులు పెంచేందుకు ఇష్టపడటంలేదు. డబ్బులు పెంచాలనగానే కొందరు లెక్కలు అడగడం మొదలుపెట్టి అదెందుకంత? ఇదేమిటిది? దీనికెందుకు ఖర్చుదండగ అంటూ ఆరాలు తీసి చివరకు తొంటి చెయ్యి చూపిస్తున్నారు.

రామదాసు కొడుకు పేరు శ్రీను. వాడొట్టి పొగరుబోతు. మాటకిమాట చెప్పడం తలెగరేసి మాట్లాడ్డం, తండ్రి మాటను కూడా లెక్క చేయకుండా తీసిపారేయడం అందరూ గమనిస్తూవున్నారు. ఇద్దర్నీ పీకి పారేయాలని ఎదురుచూస్తున్నారు. కుదరటం లేదు.

ఆరోజు షీలా ఇంట్లో పనిచేసే రాజీ ఏడ్చుకుంటూ వచ్చింది. 'ఏమిటి సంగతంటే' శ్రీను నన్ను ఇష్టమొచ్చినట్లుగా తిడుతున్నాడని చెప్పింది.

"ఎందుకే ఏమైంది?" అంటూ షీలా ఆరాతీసింది. రామదాసు రాజీతో నవ్వుతూ మాట్లాడాడట. నీళ్ల బిందె భుజంమీదికి ఎత్తాడట. ఒకటి రెండుసార్లు రాజీ పని ఆలస్యమై, చీకటిపడితే తోడెళ్ళి కొంతదూరం దిగబెట్టి వచ్చాడట. అదీ సంగతి.

"మా నాన్నను వలలో వేసుకుంటోంది" అని శ్రీను నిర్ధారించాడు.

షీలా అవాక్కయి పోయింది. ఈ కుర్రపిల్ల ఆ ముసలివాడిని వలలో వేసుకోవడం ఏమిటో అర్థంకాలేదు.

"మీకు తెలీదమ్మా! మా నాన్న దాన్ని..." ఆగాడు.

షీలా రెచ్చిపోయింది. "నోర్మూయ్! ఏంరా నీకు ఆడవాళ్ళంటే అంతలోకువా? ఒకచోట పనిచేసే వాళ్లు మాట్లాడుకుంటే తప్పా? ఒకరికొకరు సాయం చేసుకుంటే నేరమైపోయిందా? చదువూ, చట్టుబండలా లేవుగానీ నీ బుద్ధి ఇలా వుందే?" అంటూ చడామడా తిట్టింది. రాజీ ఏడుస్తూ "పని మానేస్తానమ్మా. మా ఆయనకు తెలిస్తే చంపి పోగులు పెడతాడు" అంది.

"పిచ్చిదానా! ఇలాంటి మాటలకు భయపడి పనిమానితే నీకే కష్టం. ఆ శ్రీనుగాడి విషయం నేను తేలుస్తా. ఆడాళ్లు ఎక్కడ పనిచేసినా వాళ్లను అవమానపరచి బాధించటం బాగా అలవాటైంది. నువ్వు ధైర్యంగావుండు" అంది షీలా.

మొత్తం విషయం ప్రెసిడెంట్‌తో మాట్లాడింది షీలా. ఆయన నీళ్లు నమిలి, "రాజీ అందరితో కాస్త నవ్వుతూనే మాట్లాడుతుంది. అలా వద్దని చెప్పండి షీలా! నేను రామదాసు, శ్రీనులను కేకలేస్తాను" అన్నాడు. ఇద్దరికీ శిక్షను సరిసమానం చేసినట్టు.

"అసలు రాజీకి శిక్ష ఎందుకు? నవ్వుతూ హాయిగా సరదాగా వున్నందుకా?" అంది.

'తప్పు చేసినవాడి శిక్షలో సగభాగం నిరపరాధికా' అని షీలాకు ఒళ్లు మండిపోయింది.

"సెక్రట్రీగా చెప్తున్నా! ఆ ఇద్దర్నీ తీసేయండి, లేదా ఇలాంటి పిచ్చి వాగుడు ఎవరి గురించీ మాట్లాడకూడదని చెప్పండి. మళ్లీ ఇలాంటి ఫిర్యాదు వస్తే ఊరుకునేది లేదని గట్టిగా చెప్పండి. నిటారుగా నిమిషమైనా నిలబడలేనివాణ్ణి మనం వాచ్‌మన్‌గా పెట్టుకున్నాం. ఎందుకు? అతడో గొప్ప మగాడనా! అతడికో బుద్ధిలేని కొడుకా! రాజీ ఒక్కతోపు తోస్తే ఆమడ దూరం వెళ్లిపడతాడని చెప్పండి" అని ప్రెసిడెంట్‌ని కూడా పరోక్షంగా దులిపేసిన షీలాకు పెద్ద యుద్ధం చేసినట్టు తెగ అలసటగా అనిపించింది.

✤

ఈ ఒక్కటీ తప్ప

సత్యానంద్: నేను చెప్పేవన్నీ నిజాలే. ఒట్టు!

నిత్యానంద్: నువ్వేదైనా చెప్పు నమ్ముతాను, ఈ ఒక్కమాటా తప్ప

- శ్రీ కృష్ణవరప్రసాద్

ఇలా వృందమా...

 రుక్మిణి

రాత్రికి రాత్రే...!



ప్రతి మనిషీ జీవితంలో బాగుపడాలనే ఆశపడతాడు. సహజం! కానీ అతిగా ఆశపడటమే అసహజం.

మా అబ్బాయికి టీవీ, సినిమాల ప్రభావమో... సమాజంలోని ఉన్నత స్థాయి వర్గాలవారి సంస్కృతిని గమనించడమూలానో.. తానూ వాళ్ళలో కలిసి పోవాలనే ఆరాటం మొదలయింది. రాత్రికి రాత్రే శ్రీమంతుణ్ణి అయిపోవాలనుకుంటాడు.

"నువ్వు అదేదో ప్రైవేటు కంపెనీలో చేరమంటివే... బాగుంది. వాళ్ళు ఏమన్నారో తెలుసా నాన్నా.. బస్‌పాస్ గాక ముష్టి మూడువేల రూపాయలు ఇస్తారట. అంటే ఇక జీవితాంతం దాన్లోనే స్థిరపడి పొమ్మంటావా? నావల్ల కాదు.. నా ప్లాన్లు నాకున్నాయి"

వాడలా అన్నప్పుడు నేను కాస్త భయపడ్డాను.

భయం ఎందుకంటే.. అడ్డదార్లు లేదా షార్ట్‌కట్స్ గురించే అయితే మావాడు ఆ టైపు కాదు. సరే... అట్లా కొంతకాలం గడిచిపోయింది. నేను రిటైరయ్యాను. వచ్చిన డబ్బుతో పొందికగా ఇల్లు.. ఆడపిల్లల పెళ్ళి.. శాంతకు ముందే చేశాను. పింఛనుతో పరవాలేదు, హాయిగానే గడిచిపోతోంది.

అనుకోకుండా మావాడి పెళ్ళయిపోయింది.

ఇహ మా వాడి కలలకు అంతులేదు. ఒకటే ఆరాటం. అది పరి పరి విధాలు. రకరకాల ప్రణాళికలు.

"ఏ పనీ చేయకుండా ఇంట్లోనే కూర్చుంటే ఎలారా?" కేకలేశాను, రెస్పాన్స్ లేదు.

ఓసారి "చూడు నాన్నా, నేను బాగా సంపాదించాలి. రేపు అక్కయ్యలు ఇంటికి వస్తే... బావలను ఘనంగా సత్కరించాలిగా. రేపు కోడళ్ళ పెళ్ళికి అంతో ఇంతో సర్దాలిగా. వాళ్ళకో దారి చూపాలిగా?" అన్నాడు.

"ఆలోచనలు చాలా మంచివే. మరి ఆచరణ ఏది?"

"మన ప్రెసిడెంటు కలాంగారు కలలు కనమన్నాడు. గుర్తుంచుకో" అన్నాడు.

"కలలు కనడం మంచిదే. దానికి పునాది ఉండాలనే ఆలోచన రాకపోవడం దారుణం! జీవితాంతం కలలు కంటూనే కూర్చుంటే ఆ కలల్లోనే కరిగిపోవాల్సి వస్తుంది" అన్నాను. నా మాటలు వాడికి రుచించవు.

"నాన్నా, ఓ లక్ష రూపాయలుంటే... ఒక మినీ ట్రక్కు, బాడుగకు తీసుకోవచ్చు. రోజుకు ఖర్చులు పోను అయిదువందలు మిగుల్తాయి. వాహ్ సిటీలో అపార్ట్‌మెంట్ వాళ్ళకి రైస్ సప్లయ్. ఒక చికెన్ సెంటర్, హోటలు, ఎన్ని మార్గాలు?!"

ఇవి నా పుత్రరత్నం ప్రణాళికలోని కొన్ని అంశాలు మాత్రమే!

"నా దగ్గర నయాపైసా లేదు. అలాక్కూడా ప్రణాళికలు తయారు చేస్కో" అనేసరికి వాడు మొహం మాడ్చుకున్నాడు.

ఓరోజు హడావుడిగా వచ్చాడు.

"ఏంటోయ్ హుషారు?" అడిగాను.

"నా ఫ్రెండొకడు అమెరికా నుండొస్తున్నాడు. వాణ్ణడిగితే ఒకటికాదు. ఐదారు లక్షలిస్తాడు. నో ప్రాబ్లం" అని ఈలవేశాడు.

నెల గడిచింది. ఓరోజు నీరసపడిపోతూ వచ్చాడు.

"అదేం, అట్లా మొహం వేలాడేశావేం?" అడిగాను.

"నేను హోటలు పెడదామనుకున్న దాంట్లో ఒక మరాఠీవాడు పెట్టేశాడు. అపార్ట్‌మెంట్స్‌కు రైస్ సప్లయ్ అనుకుంటే అదో లింకు సిస్టం. ఇదివరకటి నుంచే కొందరు చేస్తున్నారట. అంతకుముందు బాగుండేదట కానీ ప్రస్తుతం చికెన్ సెంటర్లలో లాభాలు లేవట. గున్యారోగం దెబ్బకి అన్నీ మటాష్! ఇక ట్రక్కు సంగతో ఆటో విషయమో ఆలోచించాలి" అని నిట్టూర్చాడు.

"భలే. వరంగల్ సిటీలో అరవైవేలు, హైదరాబాద్‌లో లక్షా పదిహేనువేలు ఆటోలున్నాయి. మన చిన్న వూర్లోనే నూటయాభైదాకా ఉన్నాయ్! నీ బోడి ఆటో అందులో ఒకటవుతది. అయినా నీ ప్రయత్నం నీది కానిలే" అన్నాను.

తర్వాత వాడి అమెరికా మిత్రుడు అక్కడి బిజినెస్‌లో భారీగా దివాళాతీసి, కట్టుబట్టలతో తిరిగొస్తున్నాడని తెలిసింది. వాడికి వీడిలాంటి కలలు కనేవాడు బాగులే అనిపించింది. అయితే అవి విదేశీరకం.

నాకో ఫ్రెండున్నాడు. వీడిది మరో టైపు. ఏవో కథలు, కవితలు, అని గిలుకుతుంటాడు. సంవత్సరంలో వివిధ పత్రికలవారు ఏదో ఒక పండగో, సందర్భాన్ని అనుసరించో పోటీలు నిర్వహిస్తుంటారు. అలాంటప్పుడు వీడి హడావుడి చెప్పవలసినది కాదు. వీరంగం చేస్తాడు.

"ఇది ఫస్టు ప్రైజు కథ. ఈ ప్లాటుమీద సంవత్సరం నుండీ వర్కుచేస్తున్నా. ప్చ్.. వాడు కొట్టేశాడు. పోయినసారి ఉగాది నవలల పోటీలో ప్రైజ్ విన్నింగ్ నావెల్.. అదీ నేననుకున్న ప్లాటే. ఏం లాభం? కాగితంమీద పెట్టలేకపోయా"

ఇదీ వాడి శివతాండవం.

వీళ్ళంతా 'తెట్టు' లాంటి వాళ్ళు. సోమరిపోతులు. బద్ధకస్తులు. తెగించి ఏ పనిలోనూ దూరి చేయలేని వాగాడంబరులు. వీరేం సాధించలేరు. కంఠశోషతప్ప. వీళ్ళు ఇటు కుటుంబానికి అటు సమాజానికి చాలా బరువు. భూమిక్కూడా!

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

తెలంగాగర్జ

జరిగిన కథ

పటేలు, తదితరులు కోదండరాంరెడ్డిని తిట్టి కొట్టి బాగా అవమానించారు. ఆఖరికి దుమ్ముతో నిండిన అన్నం తినమన్నారు. తినకపోతే నాలుక పీకేస్తానని బెదిరించాడు హవల్దారు. కళ్ళు మూసుకుని బలవంతంగా ముద్దలు మింగి చెయ్యి కడుక్కోగా జాలిపడిన మోతాదు కరీం ఆ విస్తరి ఎత్తేశాడు. ఆ మాత్రం జాలిపడ్డం కూడా బడేమియాకు నచ్చలేదు.

(39వ భాగం)

వెంటనే బడేమియా మండిపడుతూ లేచి మోతాదు కరీంపై విరుచుకుపడ్డాడు. అందినచోటల్లా బాదాడు. చివరికి రొప్పుతూ నిలబడ్డాడు. 'వాడి ఎంగిలి నీవు తీస్తావు బద్మాష్ తూ అస్లీ ముసల్మాన్‌హై యా నక్లి ముసల్మాన్‌హై" అన్నాడు.

మోతాదు కరీం దూరంగా పోయి తలవంచుకు నిలబడ్డాడు. తన గురించి కరీం దెబ్బలు తినడంతో కోదండరాంరెడ్డి స్వయంగా విస్తరి తీసి చేతబట్టుకుని లేచాడు. దూరంగాఉన్న పెంటకుప్పలోకి విసరివేసి వచ్చాడు. చేతులు కడుక్కుని పందిట్లో గుంజనానుకుని చతికిలబడ్డాడు.

పొద్దు కుంకుతోంది.

నల్గురు సిపాయిలతో కోదండరాంరెడ్డిని తీసుకుని చెరువు వద్దకు బయల్దేరాడు హవల్దారు. పటేలు, బడేమియా ఇద్దరూ వారి వెంట నడిచారు. అందరూ చెరువుకట్ట ఎక్కి నిల్చున్నారు. చెరువు నీటిపైనుంచి వచ్చేగాలి చల్లగా తగుల్తూంది. నీటి అలలు వచ్చి కట్టకు తగులుతున్నాయి. నీటి పక్కన కోదండరాంరెడ్డిని నిలబెట్టారు. అతడికెదురుగా హవల్దారు యముని మాదిరిగా నిలబడ్డాడు.

"ఇప్డూ చెప్పు? ప్రతాప్‌రెడ్డి ఎక్డా ఉన్నాడు?" అడిగాడు.

"నాకు తెలియదయ్యా" అన్నాడు కోదండరాంరెడ్డి.

"అరె కోదండరాంరెడ్డి నీవు నిజం చెప్కాపోతే నీకీ ఇక్కడ గోరీ కట్టిపిస్తాం" అన్నాడు హవల్దారు.

కోదండరాంరెడ్డి మాటామంతీ లేకుండా పిచ్చివాడివలె చూస్తూ నిలబడిపోయాడు. అతడికళ్ల వెంట నీరు బొటబొటా కారిపోతోంది.

హవల్దారు తలూపాడు? "మామూల్ మాటల్కీ చెప్పవ్‌లేరా" అన్నాడు.

సిపాయి వైపుకు చూసి సౌంజ్ఞ కావించాడు.

సిపాయిలు యమకింకరుల మాదిరి ముందుకొచ్చారు కోదండరాంరెడ్డిని నీళ్లలోకి గుంజుకుపోయారు. అతణ్ణి బలవంతంగా నీటిలో ముంచారు. పైకి లేవనీకుండా కాళ్లతో అదిమి పట్టారు. రెండు నిముషాలనంతరం ఒడ్డుకు ఈడ్చుకొచ్చి నిలబెట్టారు. తడి ఆరకుండానే పేము బెత్తాలతో మోదారు. అతడు లబోదిబో మని మొత్తుకున్నాడు. వెర్రి కేకలు వేశాడు.

"ఫిర్ మారో బద్మాష్‌కో" అనరిచాడు హవల్దారు. సిపాయిలు తిరిగి కోదండరాంరెడ్డిని నీళ్లలోకి గుంజుకపోయారు. ముంచారు, తిరిగి బయటికి ఈడ్చుకొచ్చి బాదారు. ఈ విధంగా అతణ్ణి ఏడు వరుసలు చెరువులో ముంచారు. బయటికి తెచ్చి బాదారు. అప్పటికి అతడు తెలివితప్పి పోతున్నాడు. కళ్లు మూస్తూ తెరుస్తూ వేలగిలబడిపోతున్నాడు.

హవల్దారుకు అతడితో చెప్పించాలనే పట్టుదల ఎక్కువయింది. ఉరిమి చూశాడు. "అరే బద్మాష్ ప్రతాప్‌రెడ్డి ఎక్డా ఉన్నది చెప్పు? చెప్తే వద్దీపెడ్తాన్" అన్నాడు.

కోదండరాంరెడ్డి కళ్లు తెరిచి చూశాడు. నోటమాటరాలేదు. మతి చలించిన వాని మాదిరిగ అలాగే చూస్తున్నాడు.

హవల్దారుకు విసుకు పుట్టింది. "మొండి లంజాకొడ్కు" అన్నాడు. జేబులో నుండి గుండుసూదుల పెట్టెను బయటికి తీసి సిపాయిలకందించాడు.

సిపాయిలు కోదండరాంరెడ్డి అరచేతులను బండపై పెట్టి గుండు సూదులను దింపారు. కోదండరాంరెడ్డి పెడబొబ్బలు పెట్టాడు. ఆ ప్రదేశమంతా అతడి బొబ్బలతో మారుమోగుతోంది. పటేలు, బడేమియా ఇద్దరూ కట్టనెత్తిన నిల్చుని చిరునవ్వులు చిందిస్తున్నారు.

"ఫిర్ మారో బద్మాష్‌కో" అనరిచాడు హవల్దారు.

సిపాయిలు గుండుసూదులు పీకి ఇంకోచోట నాటారు. తిరిగి పీకారు. తిరిగి నాటారు.

కోదండరాంరెడ్డి అరచేతినిండా రక్తం ధారా ప్రవాహంగా కారుతోంది. క్షణక్షణానికీ అతడి ప్రాణాలు పైకి లేచిపోయి తిరిగి వస్తున్నాయి. యమయాతన భరించలేక గిజగిజలాడాడు. తన్నుకున్నాడు. మొత్తుకున్నాడు. కంటనీరు పెట్టాడు. హవల్దారు వైపుకు దీనంగా చూశాడు. "నేనీ బాధలు పడలేనయ్యా. ఒక్క గుండుతో ఒకసారే చంపివేయించరాదూ?" అన్నాడాతడు అతి క్షీణస్వరంతో.

ఆ మాటలకు హవల్దారు మరింతగా మండిపడ్డాడు. "బేవ్‌ఖూఫ్, నీదీ పాణాన్కీ ఒకగుండు ఖర్చుపెట్టాలా?" అన్నాడు. ఆ కోపంతో నెత్తిన ఉన్న ఇనుప బొచ్చెను దీసి బలంగా విసిరాడు. ఇనుప బొచ్చె కోదండరాంరెడ్డి నెత్తినపడి ఠాంగుమని మోగింది. వెంటనే అతడు నీటి ఒడ్డున విరుచుకుని పడ్డాడు.

***

రాత్రి రథూము పొద్దు పోయింది. మధ్యహాలులో గుడ్డి దీపం మసకగా వెలుగుతోంది. రంగనాయకమ్మ, అఖిలాండం ఇద్దరూ గోడనానుకుని నేలపై కూర్చున్నారు. ఇద్దరికీ కళ్లవెంట నీరు

కారుతోంది. వెక్కివడుతున్నారు. ముక్కులు చీదుతున్నారు.

రంగనాయకమ్మ కూతురిని మందలించింది. "అఖిలమ్మా, నీవయినా కాస్త అన్నం పెట్టుకుని తినమ్మా" అంది. ఆమె స్వరం ఆరోజు పొద్దుకుంకులు ఏడవడంతో బొంగురుపోయింది.

"నాకూ వద్దమ్మా" అంది అఖిలాండం.

"నీతో ఎట్లానమ్మా అఖిలా? నాతోపాటు తిండి తినకుండా ఉంటానంటా వేమిటీ? మీ నాన్నను అక్కడ ఎన్ని హింసలు పెడుతున్నారో ఏమిటో, నా నోటికి తిండెల పడుతుందమ్మా?"

"నాకు మాత్రం తినడానికి బుద్దెలా పుడుతుందమ్మా?" నాన్న ఇంటికి వచ్చిన తర్వాతనే అందరూ కలిసి తిందాం"

"ఇంకా మీ నాన్నను చూస్తామంటే" అంటూ వెక్కివెక్కి ఏడ్చింది. "ఇంకా ఎక్కడి నాన్న? మీ నాన్నను ఊరిబయటికి తీసుకెళ్లారట" అంది తిరిగి.

అఖిలాండం కళ్లనిండా నీరు తిరగ్గా "నాన్నను కాల్చివేస్తారామ్మా?" అనడిగింది.

"ఆ రాక్షసులు ఏం చేస్తారోనమ్మా. వాళ్లచేతికి అడ్డేమిటీ? అందులో పటేలు ముండాకొడుకు కూడా వెంట వెళ్లాడట. ఆ పుండాకోరు ఎంతచెప్తే అంత చేస్తారు. అసలు వాడివల్లేగదా మీ నాన్నకిన్ని తిప్పలు?"

"వాడి కెప్పటికయినా మన ఉసురు తప్పకుండా తగుల్తుందిలేమ్మా"

రంగ నాయకమ్మ తలూపింది. "తగుల్తుంది" అంది. "తగలకుండా వదుల్తుందా?" అంది తిరిగి.

అంతలోనే వీధి మొత్తలలో కుక్క అరవడం వినిపించింది. రంగనాయకమ్మ ఉలిక్కిపడింది. "కుక్క అరుస్తోందేమిటే తల్లీ. నా గుండెలు గుబగుబలాడుతున్నాయి. ఈ రాత్రి ఎట్లా గడిచేదీ తెలియడం లేదు" అంది.

"భయమెందుకమ్మా? తలుపుల గడియలన్నీ గట్టిగావేసి పడుకుందాం" అంది అఖిలాండం.

"ఏమోనమ్మా. అన్నిటికీ ఆ పరమాత్ముడే ఉన్నాడు. ఈ రాత్రి గడిచిపోతే రేపు చీకటితోనే లేచి మావయ్యగారింటికి వెళ్లిపోదాం"

"నాన్నను వదిలి ఎట్లా వెళ్దామమ్మా?"

"నాన్న దోవ నాన్నదే, మనదోవ మనదేనమ్మా. అంతకూ కాకపోతే నిన్ను అక్కడ దిగివిడిచి మళ్లా వస్తాను. అంతేగానీ నిన్ను ఇక్కడ ఎంతమాత్రమూ ఉండనివ్వను. తెల్లవారు ఝామున మిల్ట్రోళ్లు మనింటికి వచ్చినప్పుడు చూశావుగదూ. అంతమంది ఉండగానే నీ గడ్డం పట్టుకున్నాడు. వాడి చేతులిరిగిపోనూ"

"అందుకే వాడి చెంపమీద వళ్లు ఊడొచ్చేలా కొట్టాను. ఇక వాడి ప్రాణాలున్నంతవరకు ఇటు తిరిగి చూడడు"

"తిరిగిచూడడని మనం ఏమరచి ఉండకూడదమ్మా? రజాకారులంటే ఏమనుకున్నావు? రౌడిముండాకొడుకులు. వాళ్లను నమ్మకూడదు"

ఈ విధమైన సంభాషణ సాగుతోంది. బయట అడుగుల చప్పుడు వినిపించింది. ఆ మరుక్షణమే ఛోటామియా లోపలికి ప్రవేశించాడు.

తల్లీకూతుళ్లవైపుకు చూసి పళ్లికిలిస్తూ నవ్వాడు. వారిద్దరూ అతడివైపుకు చూశారు. తెల్లని పైజామా, సిల్కు లాల్చీ వేసుకున్నాడు. భుజంపై గల్లదస్తీ ఉంది. అతడు హాల్లోకి రావటం తోనే హాలు నలువమూలలా అత్తరు పరిమళం వ్యాపించింది. రంగ నాయకమ్మ మాత్రం ధైర్యం తెచ్చుకుంది. గొంతు నంభాళించుకుంది. "ఎవరు నువ్వు?" అని గర్జిస్తూ అడిగింది.

అతడు తిరిగి పళ్లికిలించాడు. ఎర్రగా గారపట్టిన పళ్ళు బయటపడ్డాయి. సూరవరం పీరులా ఊగుతూ ముందుకు రెండడుగులు వేశాడు. "నాకీ మర్చిపోయినారా? బడేమియా తమ్ముడిగార్ని. చోటామియా సాహెబుగార్ని" అన్నాడతడు. అఖిలాండం వైపుకు అదేపనిగా చూస్తున్నాడు.

అఖిలాండానికి అప్పటికి గుర్తుకువచ్చింది. వాడు తనతో చెంప దెబ్బ తిన్నవాడేనని నిర్ణయించుకుంది. ఇప్పుడు కసి తీర్చుకోవడానికి వచ్చాడని తలచింది. ఆమెకా భయంలో ఎటూ తోచక తల్లివైపుకు చూసింది. తల్లి ఛోటామియా వంకకు చురచురా చూసింది. "ఇక్కడికెందుకొచ్చావు? వెళ్లిపో" అనరిచింది.

"ఎల్లటాన్కీ రాలేదు బీబీ" అంటూ తలూపాడతను. అఖిలాండం సమీపానికి వెళ్లి నిల్చున్నాడు.

రంగనాయకమ్మ కూతురుకు అడ్డుగాపోయి నిల్చుంది. "ఏయ్ మనిషీ, ఇంత రాత్రివేళ నీకిక్కడేం పని? వెళ్తావాలేదా?" అని గద్దించింది.

అతడామెవైపు క్రోధంగా చూశాడు. "అసల్ నీకి ఇక్దా ఎందుకమ్మా? నువ్ బయట్కీ చావు" అన్నాడు ఆమెను పక్కకు నెట్టి అఖిలాండం చేయి పట్టుకున్నాడు. అఖిలాండం గిజగిజలాడింది. గుంజుకుంది. రెండవచేత్తో అతడి ఒంటిపై గిచ్చింది. కానీ అతడు పట్టువదల్లేదు. అంతలో రంగనాయకమ్మ వచ్చి అతడిపైబడి రెండుచేతుల గోళ్లతో రక్కింది. అతడి కుడిచేతిపై పళ్లతో కొరికింది. అతడు చేతిపట్టు వదిలేస్తూ ఆమెవైపుకు తీక్షణంగా చూశాడు. పళ్లు బిగించి, "సైతాన్‌కా రండా" అంటూ కుడిచేతితోనే బలంగా రంగనాయకమ్మను నెట్టాడు. ఆమె దూరంగా వెళ్ళిపడింది.

చేతిపట్టు వదిలించుకున్న అఖిలాండం గదిలో ప్రవేశించింది. ఆమె వెంట అతడు గదిలో ప్రవేశించాడు. కిందపడిన రంగనాయకమ్మ ఆదుర్దాగా లేచింది. ఆవేశంగా గదిలోకి పరుగెత్తింది.

"అరె మేరా బాబీ, ఆరె మేరా ప్యారీ" అంటూ చేతులు చాపుకుని అఖిలాండంపైకి పోతున్నాడు ఛోటామియా. అఖిలాండం గదిలో ఒక మూలకు ఒదిగి వణకుతూ నిల్చుంది.

అప్పుడే గదిలోకి ప్రవేశించిన

రంగనాయకమ్మ చేతికి పెద్ద గొడ్డలికర్ర తగిలింది కర్రపట్టుకుని గొడ్డల్ని పైకెత్తింది. అంత చీకటిలోనూ గొడ్డలి తెల్లగా, తళతళా మెరుస్తోంది. ఆవేశంగా రెండడుగులు వేసి అఖిలాండం పైకి పోతున్న అతడి తలకు సూటిగా పెట్టి బలంగా విసిరింది.

మరుక్షణమే అతడు తాడిచెట్టు మాదిరి విరుచుకపడ్డాడు.

***

తూర్పున తెల్లని రేఖ. ఇంకా మసకచీకటిగానే ఉంది. దూరంగానున్న గ్రామంలో నుండి, కావుకావుమని కాకుల అరుపులు వినిపిస్తున్నాయి. చెరువు నీటి పైనుండి చల్లని మందమారుతం వచ్చి తగుల్తోంది.

అప్పుడే కోదండరాంరెడ్డి కి మెలకువవచ్చింది. కళ్లు విప్పి చూశాడు. ఎదురుగా చెరువు నీరు కనిపించింది. అతడి అవయవాలన్నీ విపరీతంగా బాధపెడుతున్నాయి. తలమీది గాయం పచ్చి పుండు మాదిరిగా ఉంది. బాధకు ఓర్చుకుని బలమంతా కూడదీసుకుని పక్కకు పొరలాడు. పక్కలో ఏదో కదిలిపోతున్న చప్పుడు వినిపించింది. పరీక్షగా చూశాడు. దండచేతిలావు పాము జరజర నీళ్లలోకి జారిపోతూండడం కనిపించింది.

మరుక్షణమే అతడు ఉలికిపాటుతో లేచి కూర్చున్నాడు. చుట్టూరా చూశాడు. అతడికెవరూ కనిపించలేదు. తర్వాత అతడి మెదడుకు ఒక్కొక్క విషయం గుర్తుకు రాసాగింది. నిన్నటి సాయంత్రం అతడువడ్డ బాధలన్నీ తలంపుకు వచ్చినయి. అరచేతులు చూసుకున్నాడు. రక్తం ఎండిపోయి పూతవేసినట్టుంది. చేతివేళ్లన్నీ నలువులు పెడుతున్నాయి. అక్కడ ఇంకో క్షణం ఉండడానికి భయకంపితుడైపోయాడు. నెమ్మదిగా కట్టపైకి పాకాడు. సమీపంలోనే మనిషి నిలువెత్తున ఎదిగి ఉన్న దర్భగడ్డి పోరంబోకులో ప్రవేశించాడు.

భళ్లున తెల్లవారింది. అతడు కోటంవాగుదాటి పల్లపుచేనుకు సూటిగా నడిచాడు. దారీతెన్నూ లేకుండా జొన్నచేలకు అడ్డుగాపడి నడవడంతో అతడి చేతి వేళ్లు జొన్నకర్రలకు తగిలి మరీ బాధపెడుతున్నాయి. మూలుగుతూ తోటవద్దకు చేరుకున్నాడు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె శివలీల

షూట్ చేస్తే సరి!?



చాలామంది అబ్బాయిలు బహిరంగ ప్రదేశాల్లో అమ్మాయిలకెదురవుతున్న వేధింపులను ఓ సమస్యగానే పరిగణించట్లేదు.

రోడ్డుమీద వెళుతున్నారా? ఆకతాయిలు మీ వెంటపడుతున్నారా? మీపై రకరకాల కామెంట్స్ విసురుతున్నారా? 'వీళ్లనెలా ఎదుర్కోవాలబ్బా...' అని ఆలోచిస్తూనే మీరు రోజులు గడిపేస్తున్నారా? రోజురోజుకూ వారి ప్రవర్తన శృతి మించుతోందా? 'పోలీసులకు చెబితే... ప్చ్...! అనవసరమైన గొడవ ఎందుకు చెప్పు' అంటూ మనసుకు సర్ది పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారా? వీటన్నింటికీ 'అవును' అన్నదే మీ సమాధానమా? అంతేకాదు... "వారి ఆగడాలు మితిమీరుతున్నాయి... ఇప్పుడేం చేయడం... ఎనీ సజెషన్ ప్లీజ్..." అనీ అడుగుతున్నారు కదూ. దీనికెందుకింతలా బాధపడడం... వారిని షూట్‌చేసి పారేస్తే సరి... ఏంటీ ఆలోచిస్తున్నారు? ఓహో... గన్నెలా సంపాదించడం అనా? అనుకుంటూనే ఉన్నాను ఇలాంటిదేదో అవుతుందని. 'షూట్‌చేయండి' అంటే చాలు 'గన్'గురించి ఆలోచించడమే.... గన్‌తోనే కాదు... కెమెరాతోనూ షూట్ చేయొచ్చు! అదేనండీబాబూ! మీ సెల్‌ఫోన్‌లో ఉన్న కెమెరాతో...

"అవును! మీరు బహిరంగ ప్రదేశాల్లో అపహాస్యానికి గురైనప్పుడు, ఎవరైనా మిమ్మల్ని అవమానపర్చినప్పుడు వారిని ఫొటో తీయడమే కాదు... ఆ ఫొటోను www.hollabacknyc.comకి మెయిల్ చేయండి. ప్రపంచంలోని ప్రతిఒక్కరూ ఆ ఫొటోలను చూసేలా చేయండి. దాంతో సదరు వ్యక్తి అవమానభారంతో కుంగిపోవాల్సిందే..." అంటోంది హొల్లా బాక్ ఎన్‌వైసి అనే సంస్థ. అనడమే కాదు ఓ వెబ్‌సైట్‌నూ స్థాపించింది. మరి దీనిపై నేటి యువత స్పందనేంటో తెలుసుకుందామా...

"అమ్మో... నిజంగా అలాంటి వెబ్‌సైట్ అందుబాటులో ఉంటే... మాకు ఎంటర్‌టైన్‌మెంటెలా ఉంటుంది. రోజులు చాలా భారంగా గడుస్తాయి. ఊహిస్తుంటేనే బోర్‌గా ఉంది" అంటాడు దీపక్. ఈ పాతిక సంవత్సరాల యువకుడు పీజీ పూర్తిచేశాడు. తన మిత్రబృందంతో కలిసి గాళ్స్ కాలేజీ స్టాప్‌లో బైఠాయిస్తాడు. వచ్చేపోయేవారిని, వయసుతో నిమిత్తంలేకుండా, కామెంట్ చేయడం అతని డ్యూటీ. "ఇంత వయసొచ్చింది. ఉద్యోగం చేసుకోవచ్చుగా? నీకిదేం పోయేకాలం" అని ఓ బామ్మ అడిగింది. "చచ్చేంతవరకూ ఉద్యోగం చేయాల్సిందేగా... ఈ కొన్నాళ్లైనా ఎంజాయ్ చేస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నావేం ముసల్దానా..." అంటూ ఆమెపై గయ్యిమన్నాడు. ఇదీ ఇతని వాలకం.

"ఇలా వేధింపులకు గురిచేస్తున్నవారిలో కేవలం చదువులేనివారు, ఆకతాయిలే ఉంటారనుకోవడం పొరబాటు. మాకెదురైనవారు చాలామంది విద్యావంతులే, పెద్ద హోదాల్లో ఉన్నవారే! సాయంత్రం ఆరుగంటలు దాటితే చాలు వీళ్లచేష్టలకు, మాటలకు లైసెన్స్ వచ్చినట్లే. ఇక ఏడుదాటితే అడ్డూ ఆపూ ఉండదు. చదువుకున్న వారూ ఇలా ప్రవర్తిస్తారెందుకో..." అని వాపోయింది స్వాతి.

"అయ్యో... నిజంగానే అమ్మాయిలు తమను వేధించే అబ్బాయిల ఫొటోలను వెబ్‌సైట్‌లో ఉంచితే... ఇంకేమైనా ఉందా... మా బాస్, కొలీగ్స్, ఫ్రెండ్స్ వాటిని చూస్తే ఎంత అవమానకరంగా ఉంటుంది. ఎంత చెడ్డ పేరొస్తుంది? వీళ్లంతా బయటివాళ్లు అని సరిచెప్పుకున్నా మా పేరెంట్స్, ఫ్యామిలీ మెంబర్స్ చూస్తే తలెత్తుకు తిరగగలమా" అంటాడు ఓ కాల్‌సెంటర్ ఉద్యోగి.

"వాళ్లు అమాయకంగా నిల్చుని ఉంటే, తగుదునమ్మా అంటూ మేం దగ్గరికెళ్లి వేధిస్తామా? మాకేం పన్లేదా ఏంటి? వాళ్ల డ్రెస్సింగ్ స్టైల్సే రెచ్చగొట్టినట్లు ఉంటాయి. మా నోరు ఊరికే ఉండక ఏదో వాగేస్తాం. వాళ్లు రెచ్చిపోతే... మేం వాళ్లను ఫాలో అవుతాం. తప్పంతా వారి దగ్గరే ఉంచుకుని మమ్మల్నంటారేంటి?" అన్నాడో అబ్బాయి.

విభిన్న ప్రాంతాలనుంచి అందిన ఫొటోలను హొల్లాబాక్‌సంస్థ పరిశీలనలో ఉంచింది. వేధింపులకు గురైన అమ్మాయిల్లో అధికశాతం ఫార్మల్‌వేర్స్‌లోనే ఉన్నట్లు తేలింది. భారతదేశంలోని బ్లాక్‌నాయిస్‌ప్రాజెక్ట్‌తో కలిసి ఈ సంస్థ సంయుక్తంగా ఓ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నది. వేధింపులకు గురైన అమ్మాయిల ఫొటోలను, ఆ సమయంలో వారి వస్త్రధారణను ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గమనించవచ్చు.

"వేధింపులు... వాటికోసం ఒక వెబ్‌సైట్... అంతా ట్రాష్..! ఎప్పుడో అరుదుగా సంభవించే సంఘటనలకు ఎందుకింత సీన్ క్రియేట్ చేస్తారో..." అని పెదవి విరిచాడో యువకుడు. కాగా చాలామంది అబ్బాయిలు బహిరంగ ప్రదేశాల్లో అమ్మాయిలకెదురవుతున్న వేధింపులను ఓ సమస్యగానే పరిగణించట్లేదు.

"మేం నిస్సహాయులం... ఇలాంటి వారిని ఎదుర్కోడానికి ఏమీ చేయలేం" అన్న బాధ మాకు తప్పించింది. వారి మొహాలను ప్రపంచమంతా చూసేట్టు, అసహ్యించుకునేట్టు చేస్తున్నాం. పోలీసులకు కంప్లైంట్ ఇచ్చి కోర్టు చుట్టూ కేసులంటూ తిరగడం కన్నా ఇదే బెటర్... అంటున్నారు చాలామంది అమ్మాయిలు.

చందు



సినీ రచయిత అబ్బూరి రవి చెబుతోన్న కబుర్లు

ఆ రెండు సన్నివేశాలు బాగా ఇష్టం

'బొమ్మరిల్లు'లో చివరి రెండు సన్నివేశాలు బాగా ఇష్టం : అవి పాత్రలపరంగా ఇలా సాగుతాయి...

<u>హాసిని(జెనీలియా)</u> : సిద్ధూ ఇంతకుముందు మాట్లాడడానికి ఫోన్ చేసేవాడు... ఇప్పుడు తిట్టడానికి ఫోన్ చేస్తున్నాడంకుల్. సిద్ధూ తిట్టాడని నేను వెళ్ళిపోవడం లేదంకుల్... సిద్ధూ ఇంతకుముందు కూడా తిట్టేవాడు. అందులో ప్రేమ కనిపించేది. ఇప్పుడు ప్రేమ కనిపించడం లేదు. ఇంట్లో నేనూ, నాన్న ఇద్దరమే ఉంటాం. అప్పుడు కూడా ఒంటరిగా ఫీలవ్వలేదు. కానీ ఇప్పుడు ఇందరి మధ్యలో ఉండి కూడా ఒంటరిగా ఫీలవుతున్నానంకుల్. ఒకప్పుడు కనీసం నాలుగు మాటలు మాట్లాడేవాడు. ఇప్పుడసలు మాట్లాడవద్దంటున్నాడు. నాకు సిద్ధూ కరెక్ట్ కాదంకుల్... ' అని వెళ్ళిపోతుంది.

<u>సిద్ధూ</u> :'ఇంట్లో మీకు నచ్చింది చేయలేక, బయట నాకు నచ్చింది చేయలేక నరకం చూశాను నాన్నా... ఆఖరికి ఎలా తినాలో కూడా మీరే చెబుతుంటే గొంతు దిగడం లేదు నాన్నా... చొక్కా కొంటారు, నాకు నచ్చిందని మీరే కన్విన్స్ చేసేస్తారు. నాకెలావుంటుందో తెలుసా! చింపి పారేసి నాకు నచ్చలేదు అని అరవాలనిపిస్తుంది. ఆఫీసుకు వెళ్ళమంటారు, వెళ్తాను. కానీ, నేను వెళ్ళేలోగా ఆ పని మీరే చేసేస్తారు. నవ్వుతున్నారు నాన్నా... నన్ను చూసి. నేనెందుకలా ఉన్నానో అమ్మే అర్థం చేసుకోలేకపోయింది. ఆ అమ్మాయికి ఎలా తెలుస్తుంది నాన్నా. ప్రేమే లేదని వెళ్ళిపోయింది'

ఇలా సినిమాలో పతాకసన్నివేశాల్లో వచ్చే ప్రతి డైలాగూ నాకు ఇష్టమైందే.

కళ్ళ వెంట నీళ్ళు తెప్పించకపోతే నాదే లోపమన్న మాట!

'బొమ్మరిల్లు' క్లైమాక్స్ పాటను సిరివెన్నెల సీతారామశాస్త్రిగారితో రాయిద్దామన్నాను. శాస్త్రిగారితో రాయించాలంటే ముందు కథ చెప్పాలి. ఆయనకు నచ్చాలి. అప్పుడుగానీ రాయరన్న చిన్న టెన్షన్ ఉంది. 'నువ్వు కథ చెప్పి ఆయనతో రాయించగలిగితే మాకేమీ అభ్యంతరం లేదు' అని 'దిల్' రాజు, భాస్కర్, వాసు అన్నారు. చంద్రబోస్‌కి డైరెక్టర్ కథ చెప్పాడు. ఆయన ఆల్‌మోస్ట్ కళ్ళ వెంట నీళ్ళు పెట్టుకున్నాడు. శాస్త్రిగారికి కథ చెప్పి ఆయన కళ్ళ వెంట నీళ్ళు తెప్పించకపోతే కథ చెప్పడంలో నా లోపం ఉన్నట్టు. అసలు కథ నా మైండ్‌కే ఎక్కలేదా అన్న సైకలాజికల్ ఫీలింగ్... రెండున్నర గంటలపాటు డైలాగ్స్ విత్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కథ చెప్పాను. చివరికొచ్చేసరికి తల దించుకుని ఉన్నారు. ఆయనకు నచ్చిందా, నచ్చలేదా? అసలు వింటున్నారా, లేదా? ఏం చెబుతారో! ఇదో పెద్ద టెన్షన్ అయిపోయింది. ఇంతలో తల పైకెత్తి కళ్ళు తుడుచుకుంటుంటే నాలో ఆనందం. ఎలా ఉంది సార్ అని అడిగితే 'నువ్వు చాలా మంచి ఆర్టిస్టువయ్యా' అన్నారు. అదేంటి సార్! అనడిగితే, 'నీ మాడ్యులేషన్‌లో డైలాగ్స్ చెబుతుంటే హీరోయిన్ క్యారెక్టర్ కళ్ళముందు కనిపించింది. 'నాతో ఫ్రెండ్లీగా ఉండండిరా' అని నేను ఇంట్లో అంటుంటాను. కథ బాగుంది. కథకుణ్ణి అభినందించానని చెప్పు. ఈ సినిమా బ్లాక్ బస్టర్. ఈ పాట నేను రాస్తున్నాను' అన్నారు. 'నమ్మక తప్పని నిజమైనా... నువ్విక రావని చెబుతున్నా... ఎందుకు వినదో నామది ఇపుడైనా...' అనే పాట రాశారు.

చేసే పని బోర్ కొట్టి....

మాది భీమవరం. సొంత ఊర్లో బి.యస్.సి(బి.జెడ్.సి), ఆ తర్వాత ఒంగోలులోని నాగార్జున యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ పి.జి. సెంటర్లో ఎం.బి.ఎ.లో మార్కెటింగ్ చేశాను. హైదరాబాద్‌లో పి.జి.డి.సి.ఎ., 2డి యానిమేషన్, 3డి యానిమేషన్ పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నించసాగాను. ఎం.బి.ఎ. మార్కెటింగ్ చేసినా అటుగా ఉద్యోగ ప్రయత్నాలు చేయదలచుకోలేదు. ఎందుకంటే... పెట్టిన టార్గెట్ రీచ్ అయితే మెచ్చుకుని ఇంకా టార్గెట్ పెంచుతారు. ఒకవేళ చేరలేకపోతే తిట్టి మళ్ళీ అదే టార్గెట్ ఇస్తారు. ఉద్యోగంలో భాగంగా కనీసం రోజుకు 12 నుండి 14 గంటల వరకు కష్టపడాలి. ఈ తరహా జాబ్ ఎందుకో నాకు సరికాదనిపించింది. తర్వాత ఎడ్వర్‌టైజింగ్ (పబ్లికేషన్‌లో యాడ్స్) దిశగా ఉద్యోగంలో ప్రవేశించాను. ఆరున్నర సంవత్సరాలపాటు ఈ రంగంలో ఉన్నప్పటికీ ఐదు నెలలకే మొదటి ఉద్యోగానికి రిజైన్ చేసి 'యామిని కమ్యూనికేషన్స్' అని సొంతంగా పెట్టుకుని ఫ్రీలాన్స్ కాపీ రైటర్‌గా అడ్వర్‌టైజింగ్ కంపెనీలకు రాస్తూ వచ్చాను. ఈ రంగాన్ని ఆరున్నర సంవత్సరాలు అంటిపెట్టుకుని ఉన్నా. ఇది కూడా బోర్ కొడుతోంది కదా అని స్నేహితుడు సురేష్ ద్వారా యాడ్ ఫిలింస్‌కి కాన్సెప్ట్స్ రాయడాన్ని వృత్తిగా ఎంచుకున్నా. 'అపోలో', 'లోక్‌సత్తా', 'డాక్టర్ రెడ్డి లాబ్స్', 'జన్మభూమి' యాడ్స్‌కు కాన్సెప్ట్ నుండి ఫైనల్ ప్రొడక్షన్ దాకా అంతా నేనే చూసుకునే వాణ్ణి. చేస్తున్న పని మళ్ళీ బోర్ కొట్టడంతో జాబ్ మానేసి తొమ్మిది నెలలు ఖాళీగా ఉండిపోయాను.

బెంచ్‌మేట్ సలహా మేరకు ఈ రంగంలోకి

'అతడు' సినిమా దర్శకుడు, ప్రముఖ రచయిత అయిన త్రివిక్రమ్ శ్రీనివాస్, నేనూ నైన్త్, టెన్త్ క్లాస్ చదివే రోజుల్లో బెంచ్‌మేట్స్. ఆ తర్వాత కూడా ఒకే కాలేజీలో అతను ఎం.పి.సి, నేను బై.పి.సి. చదివాం. గ్రూపులు వేరయినా క్రికెట్ ఆడడానికి గ్రౌండ్‌లో కలుస్తూ ఉండేవాళ్ళం. అతనికి ఫస్ట్ నుంచీ సినిమాల్లోకి వెళ్ళాలని ఉండేది. అంతేకాకుండా బాగా చదివేవాడు. నేనూ చదివేవాణ్ణి, కానీ అతనంత బాగా మాత్రం కాదు. ఎం.ఎస్.సి.లో న్యూక్లియర్ ఫిజిక్స్ చదవడంకోసం అతను ఆంధ్రా యూనివర్సిటీకి వెళ్ళిపోయాడు, ఎం.బి.ఎ. కోసం నేను నాగార్జున యూనివర్సిటీలో జాయిన్ అయ్యాను. నేను హైదరాబాద్ వచ్చే సమయానికి దర్శకుడు కృష్ణవంశీ దగ్గర త్రివిక్రమ్ పనిచేస్తున్నాడు. అప్పుడు కూడా ఇద్దరం కలుస్తూ ఉండేవాళ్ళం కానీ సినిమాల మీద నాకంత ఇష్టం ఉండేది కాదు.

(ఇంకా వుంది)

చిన్నారి చిత్రకారులు

బి.శ్రావణ్,
9వ తరగతి,
రామకృష్ణ మిషన్
హైస్కూల్,
సీతానగరం,
గుంటూరు.

మీరూ ఈ నేస్తాల్లా చక్కటి బొమ్మలేస్తారా? మరైతే ఆలస్యమెందుకు? రాబోయే దీపావళిని దృష్టిలో పెట్టుకొని చక్కటి బొమ్మలు వేసి, మాకు పంపించండి. ఎంచక్కా ఊరు, పేరుతోసహా ప్రచురిస్తాం. మీ బొమ్మలు మాకు చేరాల్సిన చిరునామా:

చిన్నారి చిత్రకారులు,
ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1,
అశోక్ నగర్,
హైదరాబాద్.

కె.ఆర్.సందీప్, 8వ తరగతి,
సి.వి.రామన్ టాలెంట్ స్కూల్, వనపర్తి.

హేయ్! కింద ఆరు కుక్కలున్నాయికదా. అవి చలికాలంలో వాకింగ్‌కి వెళ్లి ఇలా బిగుసుకు పోయాయి. ఏ కుక్క పేరు ఏదో చెప్పకోండి చూద్దాం.



మా పేర్లేంటబ్బా...



ఎక్కువ పూలను చుట్టిన తుమ్మెద ఏదో!



A నుంచి Z వరకు రాయండే



పైనున్న బొమ్మల పేర్లను ఆంగ్ల అక్షరమాల ప్రకారం వరుసగా రాయండి చూద్దాం

1	8	15	21
2	9	16	22
3	10	17	23
4	11	18	24
5	12	19	25
6	13	20	26
7	14		



ఈ బలశాలి ఎవరు!



పదిహేను తేడాలు కనుక్కోవాలోచ్

జవాబులు

మా పేర్లేంటబ్బా...

పై వరుస

1.sparky 2.fido 3.jip

కింది వరుస

4.rover 5.spot 6.jumper

ఎక్కువ పూలను చుట్టిన తుమ్మెద ఏదో!

నాలుగవ తుమ్మెద

A నుంచి Z వరకు రాయండే

apple, ball, bell, bird, cat, coat, dog, ear, grapes, hat, igloo, key, monkey, nest, octopus, pan, rocket, scissors, television, tomato, tree, umbrella, vest, watermelon, yo_yo, zip.

పదిహేను తేడాలు కనుక్కోవాలోచ్

1-2.ఆకాశంలో మేఘాలు, 3-4. మధ్యలో ఆవు చెవి, తోక 5-6-7. ఎడమవైపు వున్న ఆవు కొమ్ములమధ్య, చెవి కింద, కాలిపైన మచ్చ, 8-9-10-11. కుడిచేతివైపు ఆవు పడుకున్న తొట్టిమీద సున్నాలమధ్య నల్లటి మచ్చ, తొట్టిమీద అడ్డచారలు రెండు, ఆవు మూతి, 12-13-14-15. పంపు కింద నేల, పంపు మీది గుండు, పంపుకి నీళ్లొచ్చేదగ్గర నల్లటి మచ్చ, దానిమీద అడ్డగీత.



వి. వనీన్ కుమార్

ప్రస్తుతం యావత్ భారత దేశాన్ని డెంగ్యూ వణికిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ మొదలు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో డెంగ్యూ మహమ్మారి ప్రజల కంటి కునుకును దూరం చేస్తోంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా సుమారు 3500కు పైగా కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి అన్బుమణి రాందాస్ ప్రకటించారు. 47 మంది మృత్యువాత పడ్డారు. దేశవ్యాప్తంగా డెంగ్యూ బాధితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. మన రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 11 మంది మరణించారు. ప్రభుత్వం, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సమిష్టికృషితోనే దీన్ని అరికట్టగలుగుతాం.

గున్యా పోలే డెంగ్యూ వచ్చె

ఇదీ చరిత్ర : కొన్ని దశాబ్దాలుగా డెంగ్యూ వ్యాధి అనేక దేశాలకు వ్యాపిస్తోంది. దాదాపు వంద దేశాల్లో ఇది కనిపించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 1970 నుంచి 1995 వరకు ప్రపంచ వ్యాప్తంగా 1.3 మిలియన్ల కేసులు నమోదయ్యాయి. ఇందులో 3600 మంది మృత్యువాతపడ్డారు.

డెంగ్యూ జ్వరం మొదట 1779-1780లో ఆసియా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా దేశాల్లో ప్రబలింది. మొదట్లో ఇది ప్రాణాంతకంగా ఉండేది కాదు. అప్పట్లో ప్రధాన రవాణా సౌకర్యాలైన పడవ ప్రయాణాల ద్వారా ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వ్యాపించేది. అయితే ఒక ప్రాంతంలో ఒకసారి వచ్చాక పదేళ్ల తరువాత వచ్చేది. అప్పటి దాక ఇది ఈ మూడు ఖండాల్లోనే కనిపించిన డెంగ్యూ వ్యాధి రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. 1950లో ఈశాన్య ఆసియా దేశాల్లో కనిపించింది. కానీ 1975 తరువాత తరచుగా వస్తూ పిల్లల మరణానికి కారణమయ్యేది.

ప్రస్తుత పరిస్థితి

అనేక సంవత్సరాలపాటు కనిపించకుండా పోయిన డెంగ్యూ రెండోసారి 1960లో కోల్‌కతా, విశాఖపట్నాల్లో డెంగ్యూ విజృంభించింది. 1970లో పసిఫిక్ ప్రాంతంలో మళ్లీ కనిపించింది. 1980లలో శ్రీలంక, మాల్దీవుల్లో డెంగ్యూ జ్వరం కనిపించింది. 1994లో పాకిస్థాన్‌లో మొదటిసారిగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. డెంగ్యూలో నాలుగు రకాల వైరస్‌లు ఉంటాయి. శ్రీలంక, భారత్‌లలో అన్ని రకాల వైరస్‌లు కూడా ప్రభావితం చేస్తాయి. అయితే ప్రధానంగా డెంగ్యూ-3 వైరస్ ఎక్కువగా కనిపిస్తోంది. 35 ఏళ్ల తరువాత 1985లో చైనా, తైవాన్‌లో, 1994లో సింగపూర్‌లో వచ్చింది. ఇరవై ఏళ్ల నుంచి ఈ దేశాల్లో దీని నివారణకు సమర్థవంతంగా కృషి చేయడం వల్ల డెంగ్యూ వ్యాపించకుండా చేయగలిగారు.

ఏడాది నుంచి...

దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు 2005 నుంచి పెరగడం మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా దీని ప్రభావమున్నట్లు ఒక అంచనా. డెంగ్యూ హేమరేజ్ ఫీవర్ (డిహెచ్ఎఫ్) సోకిన వాళ్లలో ఐదు శాతం ప్రజలు చనిపోతున్నారు. సరైన చికిత్సతో ఈ సంఖ్యను ఒక శాతానికి తగ్గించవచ్చు. ఎక్కువగా చిన్నపిల్లలు, యువకులు దీని బారిన పడుతున్నారు.

డెంగ్యూ వ్యాపించడానికి కచ్చితమైన కారణాలేంటో ఇంతవరకూ కనుక్కోలేదు. కానీ కొన్నింటిని గుర్తించారు.

1) పట్టణీకరణ, జనాభా పెరుగుదల వల్ల నీటిసౌకర్యం, మురుగు నీటి పారుదల, చెత్త పేరుకుపోవడం మొదలైన కారణాలతో ఈ దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

2) చాలా దేశాల్లో డెంగ్యూ ప్రబలినప్పుడే చర్యలు తీసుకుంటున్నారు. శాశ్వత చర్యలు తీసుకోకపోవడం వల్ల తరచుగా ఈ వ్యాధి వస్తోంది. స్థానికంగా ఉండే డాక్టర్లకు కూడా దీనిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ఇది డెంగ్యూ అనేది గుర్తించి, నివారణ చర్యలు చేపట్టేలోపే జబ్బు విస్తృమవుతోంది.

3) ఈ వ్యాధిగ్రస్తులు విమానాల్లో ప్రయాణించడం వల్ల ఒక దేశం నుంచి ఇంకో దేశానికి వ్యాపిస్తోంది.

4) చాలా దేశాల్లో దోమలను నివారించే కార్యక్రమాలు గానీ, సాంకేతిక పరిజ్ఞానం కాని లేకపోవడం వల్ల కూడా దీన్ని పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పద్ధతులు అంత శక్తివంతమైనవి కావు.

భవిషత్తు దృశ్యం

ఉష్ణమండల పట్టణ ప్రాంతాల్లో ఎడిన్ ఈజిప్టై దోమ నివసిస్తుంది. ఈ దోమ కాటుకు గురైన వాళ్లు వివిధ ప్రాంతాలకు ప్రయాణించడం వల్ల ఇది వ్యాపిస్తుంది. ఇప్పటి వరకు డెంగ్యూ నివారణకు వ్యాక్సిన్‌ను కనుక్కోలేదు. ఇటీవల కనుక్కొన్న వ్యాక్సిన్‌ను ప్రయోగాత్మకంగా పరిశీలించాల్సి ఉంది. దీన్ని బట్టి చూస్తే మనకు ఐదు నుంచి పదేళ్ల దాక వ్యాక్సిన్ అందుబాటులోకి రాకపోవచ్చునని తెలుస్తోంది. దీనికి సరైన వ్యాక్సిన్ లేనందువల్ల చాలా దేశాలు దోమలను నివా రించే కార్యక్రమాలను చేపడు తున్నాయి. ఇవి కూడా ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారానే విజయం సాధించగల్గుతాయి. 2001 నాటికి ఈ వ్యాధి నివారణపై పరిశోధనల కోసం ప్రపంచ వ్యాప్తంగా 7500 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు ఒక అంచనా.





ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యక్రమాలు

ఐదు అంశాల ఆధారంగా డెంగ్యూ నివారణకై 1995నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ కింది కార్యక్రమాలను చేపట్టింది.

1) వివిధ దేశాల్లోని వైద్యనిపుణులకు, ప్రజలకు డెంగ్యూ నివారణ నిమిత్తం శిక్షణ ఇస్తోంది. 2) ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాకుండా, ఇది వచ్చినప్పుడు ఇంటి వద్దనే ప్రాథమిక చికిత్స చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలను చేపడుతోంది. 3) దీనికి కావాల్సిన సామాగ్రిని అందిస్తోంది. దీన్ని నివారించే సాంకేతికతను, నివారణ పద్ధతులను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోంది. 4) వ్యాధులు ఒకేసారి విజృంభించినప్పుడు చేపట్టే అత్యవసర చర్యలను కూడా సూచిస్తోంది. 5) వ్యాధిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వాలకు మార్గదర్శకత్వం వహిస్తూ వాటి పనులను పర్యవేక్షిస్తోంది. ఎడిస్ ఈజిప్టై దోమ కాటు వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని చెప్పుకున్నాం కదా. డెంగ్యూ వైరస్‌లు నాలుగు రకాలు. అవి వరుసగా డిఇఎన్-1, డిఇఎన్-2, డిఇఎన్-3, డిఇఎన్-4. ఈ వైరస్‌లలో ఏదైనా ఒక రకం వైరస్ వల్ల డెంగ్యూ వస్తుంది. దోమలు రక్తం పీల్చే సమయంలో వైరస్ ప్రవేశిస్తుంది. ఈ జ్వరం రెండు నుంచి ఏడు రోజుల వరకూ వుంటుంది. రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోవడం డెంగ్యూ జ్వరం ప్రత్యేకత. ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోగానే రక్తంలోని ద్రవం రక్తనాళాల రంధ్రాల ద్వారా కడుపులోకి, ఛాతీలోకి స్రవిస్తుంది. రక్తనాళాల్లోంచి ద్రవం బయటికి రావడంతో రక్తం చిక్కబడి రక్తప్రసరణ తగ్గుతుంది. రక్తంలోని నీరు బయటికి వెళ్లడాన్ని డెంగ్యూ హేమరేజ్ అంటారు. చర్మంలో రక్తస్రావం అయినప్పుడు ఎర్రని దద్దుర్లు కనిపిస్తాయి. డెంగ్యూ హేమరేజ్ వల్ల రక్తపోటు పడిపోతుంది. దీంతో కాలేయం, గుండె, మెదడు దెబ్బతింటాయి.

విస్మృతి వంద మీటర్లే

డెంగ్యూ జ్వరానికి కారణమయ్యే ఎడిస్ ఈజిప్టై దోమ వంద మీటర్ల పరిధిలోనే తిరుగుతుంటుంది. ఎక్కువ దూరం ప్రయాణించలేదు. దోమ ఉన్న ఇళ్లు, పరిసర ప్రాంతాల్లోని వాళ్లనే కుడుతుంది. ఫలితంగా ఆ పరిసరాల్లో వుండేవారు దీని బారిన పడుతున్నారు. పగటిపూట కుట్టడం దీని ప్రత్యేకత. అందువల్ల ఇంట్లో, స్కూళ్ళలో, ఆఫీసుల్లో, బస్సుల్లో, రైళ్లల్లో ఇలా అందరూ ఈ దోమల బారిన పడుతున్నారు.

ఈ దోమ కాటు నుంచి తప్పించుకోవడానికి పొడుగు చేతుల చొక్కాలు ధరించాలి. కాళ్లకు సాక్సులు వేసుకుంటే మంచిది.

లక్షణాలు...

1) వైరస్‌తో కూడిన జ్వరం వచ్చి చలి ఎక్కువగా వుండడం, 2) కంటిరెప్పల్లో నొప్పి, 3) ఎముకల నొప్పులు, 4) వాంతులు, తలనొప్పి,

5) ముఖం కందిపోవడం,

శరీరంపై ఎర్రని మచ్చలు కనిపించడం.,

6) ముక్కులోంచి రక్తం కారడం.

జాగ్రత్తలు...

డెంగ్యూ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ లేనందువల్ల దోమ లార్వాలను అరికట్టడమే ఏకైక మార్గం. 2) ఈ దోమ నీళ్లు నిలవ ఉన్న ప్రదేశంలోనే నివసిస్తుంది. అందువల్ల ఇంట్లో, పరిసర ప్రాంతాల్లో నీరు నిలవ ఉండకుండా చూడాలి. ప్లాస్టిక్ కంటైనర్లు, డ్రమ్ములు, పూలకుండీలు, పాత ఇనుప సామాన్లు, టైర్లలో, 3) నీళ్లు నిలవ ఉండకుండా చూడాలి. వారానికోసారి డ్రై డే పాటించాలి. ఇంట్లోని బిందెలు, ట్యాంకులు, డ్రమ్ముల్లో నీళ్లు పారబోసి ఎండబెట్టాలి. దీంతో దోమ పెట్టిన గుడ్లేమైనా వుంటే చనిపోతాయి. దోమతెరలు, మస్కిటో కాయిల్స్, మ్యాట్స్ ఉపయోగించాలి. డెంగ్యూ నివారణకు కచ్చితమైన చికిత్స లేదు. జ్వరం తగ్గడానిగ్గానూ ప్యారాసిటమాల్ ట్యాబ్లెట్ తీసుకోవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో ఆస్ప్రిన్, బ్రూఫిన్ తీసుకోకూడదు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే డాక్టర్‌ను సంప్రదించాలి. డెంగ్యూ నిర్ధారణకు సీరాలజీ కచ్చితమైన పరీక్ష.

ఇందులో ఐజిఎం, ఐజిజి పరీక్షలుంటాయి. ఐజిఎంలో పాజిటివ్ వస్తే ఇన్‌ఫెక్షన్ ఈమధ్యే వచ్చినట్లు, ఐజిజిలో నెగెటివ్ వస్తే ఇన్‌ఫెక్షన్ వచ్చి చాలా రోజులు అయినట్లు.

హాస్యాస్పదంగా మంత్రుల వ్యాఖ్యలు

డెంగ్యూపై కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య మంత్రుల వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. డెంగ్యూతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన వైద్య విద్యార్థి మృతి చెందడం, ఎయిమ్స్ పరీక్షలు వాయిదా వెయ్యడం, హాస్టళ్లను ఖాళీచేసి విద్యార్థులు ఇళ్లకు వెళ్లడం వంటి పరిణామాలు జరిగాయి. పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పటికీ భయపడాల్సిందేమీ లేదని అక్టోబర్ 4న కేంద్ర ఆరోగ్య శాఖామంత్రి అన్బుమణి రాందాస్ అనడం హాస్యాస్పదం. ఇక రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి గున్యా నుంచి డెంగ్యూ వరకు ఒకే రకమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. చివరికి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించాల్సి వచ్చింది.

డ్రై డే ఒక పరిష్కారం

డెంగ్యూ బారిన పడకుండా ఉండాలంటే డ్రై డే ఒక పరిష్కారం. చికున్ గున్యా, డెంగ్యూ కారణభూతమైన ఎడిస్ ఈజిప్టై దోమను గుడ్డు

దశలోనే నిర్మూలిస్తే ఫలితం ఉంటుంది. పదిరోజుల వ్యవధిలో గుడ్డు దశ నుంచి దోమగా మారుతుంది. అందుకే వారానికోసారి డ్రై డేను పాటించాలి. ఇళ్లలో ఉన్న మంచినీటి ఫిల్టర్లు, ఎయిర్ కూలర్లు, కుండలు, బిందెల్లో నిలవ ఉన్న నీళ్లను పారబోయాలి. ఇంటిపైన ఉన్న వాటర్ ట్యాంకుల్లో నిలవ ఉన్న నీటిని పూర్తిగా తీసెయ్యాలి. పదిరోజులకోసారి శుభ్రం చేయాలి. ఇళ్ల వెనకాల పాత టైర్లు, కొబ్బరిబోండాలు, చిప్పల్లో నీరు నిలవ ఉండకుండా చేయాలి.

కావాల్సింది చిత్తశుద్ధే

డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వ్యాధుల నివారణాచర్యల్లో ప్రభుత్వానికి చిత్త శుద్ధి వుండటం చాలా అవసరం. చైనా, క్యూబా లాంటి దేశాల్లో ఇరవై ఏళ్ల క్రితమే దోమలు, ఎలుకలను సమర్ధవంతంగా నిర్మూలించడంతో ఇలాంటి వ్యాధులు అక్కడ రావడం అరుదు. అహ్మదాబాద్‌లో గున్యా జ్వరాలు వచ్చినప్పుడు గుజరాత్ ప్రభుత్వం చిత్త శుద్ధితో వ్యవహరించి పదిహేను రోజుల్లోనే అడ్డుకట్ట వేసింది. ప్రభుత్వ యంత్రాంగంతోపాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు ఆసుపత్రులను, వైద్యుల సేవలను వినియోగించుకున్నది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వమైతే దోమలపై ఏకంగా యుద్ధాన్నే ప్రకటించింది. హెలికాప్టర్ ద్వారా ఫాగింగ్ చేపట్టింది. ఇలాంటి ఉదాహరణలు రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి. డెంగ్యూ మహమ్మారిని సమూలంగా నిర్మూలించాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కావాలి. గ్రామాల్లో పంచాయతీరాజ్, పురపాలక శాఖలు, నగరాల్లో మున్సిపాల్టీలు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. యుద్ధప్రాతిపదికన ప్రతిరోజూ చెత్తా చెదారాలను, తొలగించాలి. మురుగు నీటిని శుభ్రం చేయాలి. అనునిత్యం నీటి నాణ్యత పరీక్షలు జరపాలి. దోమల నివారణపై వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా నగరాలు, పట్టణాల్లో ఫాగింగ్ నిర్వహించాలి. ప్రతి పౌరుడికీ జీవించే హక్కు ఉందని భారత రాజ్యాంగంలో పేర్కొంది. జీవించడం అంటే కేవలం భద్రత కల్పించడమే కాదు ప్రాణాంతక వ్యాధులగురించి రక్షణ కల్పించడం లేదా మీకు?' అని ఢిల్లీ హైకోర్టు వాతపెడితే అపటి నుంచి హడావుడి మొదలయింది. కేంద్ర ప్రభుత్వం



డెంగ్యూ బాధిత రాష్ట్రాలకు టీములను పంపింది. కేరళలోని ఆలపుజా జిల్లాకు కేంద్ర మంత్రి అంబుమణిరాందాసు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఫాగింగ్ మెషిన్లు, దోమ తెరలను ఆ రాష్ట్రానికి అందిస్తామన్నారు. మన రాష్ట్రంలో సైతం దోమలపై సమరానికి టాస్క్‌ఫోర్సును ఏర్పాటును చేశారు. ఇదంతా ముందే చేస్తే ఎంత బాగుండేది, ప్రాణ నష్టం ఉండేది కాదు కదా !

కుప్పకూలిన ప్రజారోగ్యం

తొంబై దశకంలో ఆర్థిక సంస్కరణలను దేశంలో ప్రవేశపెట్టడంతో ప్రజారోగ్య వ్యవస్థ కుప్పకూలింది. ప్రజల ఆరోగ్యానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి. ప్రపంచ బ్యాంక్ ఆదేశాల మేరకు ఖర్చుపెట్టడం మొదలైంది. మహమ్మారిలా లక్షలాదిమందిని పీడించే మలేరియా, చికున్‌గున్యా, విషజ్వరాలు, డెంగ్యూ మొదలైనవాటిపై ఖర్చు పెట్టకుండా ఎయిడ్స్‌పై ఖర్చుపెట్టడం పెరిగింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీససౌకర్యాలు కనుమరుగయ్యాయి. డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1960-70వ దశకంలో దేశాన్ని గడగడలాడించిన మలేరియా మహమ్మారిని మలేరియా నివారణ విభాగం పారద్రోలింది. 1990 తరువాత ఈ విభాగానికి సరైన నిధులు, పరికరాలు అందించకపోవడంతో వ్యాధులు పెరుగుతున్నాయి.

సామాన్యుల్లో ఆందోళన

డెంగ్యూ వ్యాపించిందని వెల్లడికాగానే సామాన్యుల్లో ఆందోళన నెలకొంటున్నది. సాధారణ జ్వరం వచ్చినా కూడా అది డెంగ్యూ కావచ్చుని భయపడుతున్నారు. కనుక ఇలాంటి కొత్త జ్వరాలు, వ్యాధులు వచ్చినప్పుడు వాటి లక్షణాలు, జాగ్రత్తలు, చికిత్స గురించి ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. ఇలా జరుగకపోవడంతో గందరగోళం ఏర్పడుతోంది. దీన్నో అవకాశంగా తలచి లాభార్జనే ధ్యేయంగా పెట్టుకున్న కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు వేలకు వేలు గుంజుతున్నారనే విమర్శలున్నాయి. ❖

చికిత్స ఖరీదే

డెంగ్యూ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే రోగులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ నిర్ధారణకు రూ.800 నుంచి 1600 వరకు ఖర్చు అవుతుంది. పరీక్షలో పాజిటివ్ వస్తే రోగికి రూ.900 ఖరీదుచేసే ఎఫ్ఎఫ్‌పి బాటిల్స్, రూ.1400 ఖరీదు చేసే పిఎంపి బాటిల్స్‌ను ఎక్కించి వారి రక్తంలో వైరస్‌ను నిర్మూలించాల్సి ఉంటుందని వైద్యులు అంటున్నారు. ఒక్కో రోగికి వ్యాధి తీవ్రతను బట్టి నాలుగు నుంచి ఐదు బాటిల్స్ ఎక్కించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో వ్యాపిస్తోన్న డెంగ్యూను ప్రయివేటు ఆసుపత్రులు సొమ్ము చేసుకుంటున్నాయి. డెంగ్యూ వ్యాధి ముదిరితే మరణం తప్ప మరో మార్గం లేకపోవడంతో సహజంగానే ప్రజలు కూడా దీని చికిత్సకై భారీగా ఖర్చు చేస్తున్నారు. డెంగ్యూ నిర్ధారణకు చేసే సీరాలజీ పరీక్షకుగానూ సుమారుగా వెయ్యిరూపాయలవుతుంది. అయితే చికిత్స పేరిట ప్రైవేటు ఆసుపత్రులు వేలాది రూపాయలు దండుకుంటున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. తీవ్ర జ్వరంతో వచ్చిన రోగుల్లో మలేరియా, గున్యా లక్షణాలు కనిపించినప్పటికీ డెంగ్యూ పరీక్ష కూడా చేయించుకోవాల్సిందిగా కొంతమంది వైద్యులు సూచిస్తున్నారు.

ఆరోగ్యం

వెన్ను దెబ్బలకు స్టెమ్ సెల్ థెరపీ

డాక్టర్ జిపివి సుబ్బయ్య,
కన్సల్టెంట్
స్పైన్ సర్జన్,
హైదరాబాద్.
ఫోన్:
9885012656,
9247873569

స్టెమ్‌సెల్ (మూల కణాలు) థెరపీ అనేది ఒక విప్లవాత్మక చికిత్స. టెస్ట్ ట్యూబ్ ద్వారా ఫలదీకరించిన పిండాల నుంచి, బోన్ మారో (ఎముకల మూలుగ), ముక్కు మ్యూకస్ మెంబ్రేన్ కణాల నుంచి స్టెమ్ సెల్స్ కొన్నిటిని తీస్తారు. వీటిని ప్రమాదవశాత్తూ దెబ్బతిని తిరిగి పునర్నిర్మాణం కాని నరాల కణాల్లో వుంచి స్టెమ్‌సెల్ థెరపీ పద్ధతిలో పునరుత్పత్తి జరిగేలా చేస్తారు. ఇలా చేస్తే నరాలు దెబ్బతినడం వల్ల పడిపోయిన కాళ్ళు, చేతులు తిరిగి మామూలుగా పనిచేస్తాయి.



ముందుగా మనం వెన్నుపూస (స్పైనల్‌కార్డ్) దెబ్బల గురించి తెలుసుకుందాం. కొన్ని సందర్భాల్లో నడుముకు లేదా మెడకు దెబ్బలు తగులుతుంటాయి. నడుముకు దెబ్బ తగిలినట్లయితే వాళ్లకు రెండు కాళ్లు పడిపోతాయి. మెడకు దెబ్బలు తగిలితే కాళ్ళు, చేతులు పడిపోతాయి. శరీరంలో చాలా చోట్ల కణాలు దెబ్బతిన్నప్పటికీ మళ్లీ అక్కడ పునరుత్పత్తి జరుగుతుంది. కాని వెన్నెముకలో అలా కాదు. ఈ మూల కణాలు ఏజాతి కణజాలాలుగానైనా మారగలవు. దెబ్బతగిలిన స్పైనల్‌కార్డ్‌లోకి ఈ కణాలను ఇంజెక్ట్ చేస్తే అవి కొత్త కణజాలాల్ని ఉత్పత్తి చేస్తాయి. అప్పుడు పడిపోయిన కాళ్లలో తిరిగి బలం చేకూర్చడానికి ఈ స్టెమ్‌సెల్ థెరపీ ద్వారా అవకాశముంది.

ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్‌లో చాలా పిండాలను తయారుచేస్తారు. అందులో టెస్ట్ ట్యూబ్ బేబీకి ఒక పిండాన్నే వాడతారు. తక్కిన పిండాల్ని పడేస్తుంటారు. కొంతమంది పరిశోధకులు ఆ పిండాల నుంచి స్టెమ్ సెల్స్ తీసి వాటిని ఇంజెక్ట్ చేస్తున్నారు. కాని నైతికంగా ఇది సరైన పద్ధతి కాదు. అందుకే అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో గర్భస్థ మూల కణాలపై ఆ ప్రభుత్వాలు నియంత్రణ విధించాయి.

మన శరీరమంతటా స్టెమ్‌సెల్స్ ఉంటాయి. బోన్‌మారోలో చాలా ఎక్కువగా ఉంటాయి. అలాగే మూలుగులో స్టెమ్‌సెల్స్ ఎక్కువగా ఉంటాయి. బోన్‌మారోను కొంచెం బయటకు తీసి, అందులోంచి స్టెమ్ సెల్స్‌ను తీస్తారు. ఇది చాలా సురక్షితమైన పద్ధతి. ఐదు నిమిషాల్లో చేయవచ్చు. తీసేప్రాంతంలో కొంచెం మత్తునిచ్చి, సూదితో పొడిచి స్టెమ్ సెల్స్‌ను బయటకు తీస్తారు. అలా తీసిన కణాల్లోంచి స్టెమ్ సెల్స్‌ను వేరుచేసి పెంచుతారు. అప్పుడా స్టెమ్స్‌సెల్స్‌ను తీసికెళ్లి దెబ్బతగిలిన చోట ఇంజెక్ట్ చేస్తారు.

రోగికి వాడే స్టెమ్ సెల్స్ రోగి శరీరం నుంచే తీస్తారు కాబట్టి వీటిలో ఎలాంటి నైతిక సమస్యా ఉండదు. బోన్‌మారో నుంచి తీసుకున్న స్టెమ్ సెల్స్‌ను వేరుచేసి పెంచడానికి సాధారణంగా నెలరోజులు పడుతుంది. ఇదే కాక, వాసన పసిగట్టడానికి ముక్కులో మ్యూకోజా అనే పొర ఉంటుంది. ఆ పొరలో కొన్ని నరాలు, కణాలు వుంటాయి. వాటిని ముక్కులోంచి తీసి, ప్రయోగశాలలో పెంచి స్పైనల్ కార్డ్‌లో ఇంజెక్ట్ చేయవచ్చు. ఆస్ట్రేలియాలోని ప్రిన్సెస్ అలెగ్జాండ్రియా హాస్పిటల్, మెల్‌బోర్న్‌లోని ఒక హాస్పిటల్‌లో స్టెమ్ సెల్స్‌పై విస్తృత పరిశోధనలు చేశారు. ముక్కులోని మ్యూకోజాలోంచి స్టెమ్ సెల్స్ తీసి ఎనిమిదిమందిపై పరిశోధనలు చేయగా మంచి ఫలితాలు కనిపించాయి.

వెన్నులోకి స్టెమ్‌సెల్స్ ఇంజెక్ట్ చేశాక మునుపటిలా మామూలుగా అవడం అనేది రోగిని బట్టి ఉంటుంది. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు సమయం పట్టవచ్చు. ఫలితాలు ఇంకా పరిశోధనలోనే ఉన్నాయి. ఈ చికిత్స గనుక విజయవంతమైతే పక్షవాతం వల్ల కాళ్లు పడిపోయిన వాళ్లకు నడక వచ్చే అవకాశాలున్నాయి.

♣

అందుకే

డైరెక్టర్: నా కథతో మీరో సినిమా తీస్తే హిట్టయి తీరుతుంది.

ప్రొడ్యూసర్: నీ ఫ్లాష్‌బ్యాక్ నాకు తెల్సు డైరెక్ట్రూ. ఇలా నా కథతో సిన్మా తీయండి, డైరెక్షనూ నాకే యివ్వండని నిర్మాతల్ని పట్టుకుని, ఇప్పటికి అరడజను ఫ్లాపులిచ్చావ్! వాటి గురించి ఏమంటావ్?

డైరెక్టర్: (గతుక్కుమని, సర్దుకుని) తేడా నా కథలో లేదు, డైరెక్షన్లో లేదు. ఆయా సిన్మాల నిర్మాతల్లోనే వుంది. అలాంటి తేడాలేమీ లేని నిర్మాత మీరొక్కరే (నాకు) మిగిలారు. అందుకే ఇంత గట్టిగా చెబుతున్నా

- శ్రీ కృష్ణవరప్రసాద్

దానం శివప్రసాదరావు

గ్యాసైపోయిందోచ్



వంటింట్లోంచి శ్రీమతి పొలికేక విని గాభరాపడిపోయాను. నిద్ర క్షణంలో పారిపోయింది. ఉలిక్కిపడి లేచాను. దుప్పటిని గిరాటేసి వంటింట్లోకి పరిగెత్తాను.

మా ఆవిడ బిక్కమొహం వేసుకుంది. పైనుంచి కిందివరకు చూసి 'హమ్మయ్య' మనిషికేంకాలేదనుకున్నాను.

''ఏమైంది? ఎందుకలా గుండెలవిసేలా కేకలుపెట్టావ్?" అన్నాను రెట్టిస్తూ.

"గ్యాసయిపోయింది"

స్పేర్ సిలిండర్ లేదా?"

"అదీ ఐపోయింది, గ్యాస్ ఇచ్చిన ఇరవై రోజుల తర్వాతగానీ బుక్‌చేయకూడదని ఓ దిక్కుమాలిన రూలుందిగా"

నిజం చెప్పొద్దూ! నాకా నిమిషంలో గుండెల్లో రాయి పడ్డట్లయింది.

"ముందుచూపు లేకపోతే ఇలానే ఉంటుంది. గ్యాసెన్నాళ్ళు వస్తుందో, ఎప్పుడు బుక్ చేయాలో తెలీదా?" అనరిచాను.

"నేనేమన్నా కలగన్నానా, ఇంత త్వరగా ఐపోతుందని"

"ఆ మాత్రం తెలీకుండా ఇప్పటికిప్పుడు అయిపోయిందంటే ఎలా చావను? అదేమన్నా సిగరెట్టా, వక్కపొడా క్షణంలో కొనుక్కొచ్చేందుకు! ఐనా లెక్క ప్రకారం ఇంకా పదిహేనురోజులు రావాలిగా"

''మొన్న చుట్టాల తాకిడికి ఐపోయుంటుంది"

"ఇద్దరేగా వచ్చింది"

''ఐతే మాత్రం వేణ్ణీళ్లు, ప్రత్యేక వంటకాలు, మారు మాట్లాడితే టీలు, కాఫీలు. మధ్యాహ్నం టిఫిన్లు. అయిపోదా?'

"అంతా వాళ్లిద్దరికీ వండి వార్చేసినట్లు మాట్లాడతావేం? రోజూ మధ్యాహ్నం నీ స్నేహితురాళ్లు, మీ వాళ్ళూ రావడంలేదూ?!"

"అహా! ఇంటికొచ్చిన వాళ్ళకు ఆమాత్రం కాఫీలివ్వకుండా కూర్చోబెడతారా?"









"మరి నన్ను దెప్పిపొడుస్తావేంటి? ఈనెల్లో నా తరపున వచ్చిన చుట్టాలు వాళ్ళిద్దరేగా!"

"లేకుంటే ఏంటా మాటలు? నేనేదో గ్యాసును వృథా చేసినట్లు"

"నాకు ఓ వారం, పదిరోజులు ముందుగానే చెప్పాలి"

"మీరైనా గుర్తుపెట్టుకోవచ్చుగా! నన్నొక్కర్తినే బాధ్యురాలిని చేస్తారేం?"

"అవును! ఇంట్లో ఉండేదానివి ఆ మాత్రం తెలీదా? నాకెలా గుర్తుంటుంది? నీదే తప్పు"

"కాదు నీదే తప్పు"

"నీదే.... నీదే.... తప్పు, తప్పు"

అరగంటగ్గానీ వాతావరణం సాధారణ స్థాయికి చేరుకోలేకపోయింది. బుక్ చేసిన తర్వాత ఎప్పటికొస్తుందో..

ఆ పూటకెలాగో లంచ్‌బాక్సు సిద్ధం చేసి, నా చేతికందిస్తూ శ్రీమతి అంది "తెలిసిన వాళ్లెవరైనా ఉంటే కాస్త రికమండేషన్ చేయించి త్వరగా వచ్చేలా చూడకూడదూ?" అని.

మా ఆవిడ ముఖంలోకి అయోమయంగా చూశాన్నేను.

ఆఫీసులో పన్జేసుకుంటున్నా... అదే ఆలోచన! ఎలా! ఎలా! సాధించాలి? సాధ్యమేనా? పొద్దున్నే టీ, కాఫీలు పిల్లలకు తనకు లంచ్‌బాక్సులెలా? ఇంట్లో బాయిలర్ లేదు. సంప్రదాయ ఇంధనాలసలే లేవు. అసలే చలికాలం పిల్లల స్నానాలెలా? వేళకు స్కూలుకుపంపాలి. టిండీ తిప్పలు, టిఫిన్లూ కాఫీలు?

"ఏంటోయ్ శివా! దీర్ఘాలోచనలో పడ్డావ్?" అన్నాడు కొలీగ్ ఈశ్వర్రావ్.

"ఏంలేదోయ్! గ్యాస్ పెద్ద సమస్య అయిపోయింది"

"మన టౌనుకు వారం వారం స్పెషలిస్టు వస్తారుగా. ఓసారి వెళ్లి చూపించుకోరాదూ!"

"చాల్లే! నీ కుళ్లు జోకులు. ఆ గ్యాస్ కాదు. గ్యాసు సిలిండర్ అయిపోయింది"

"బుక్ చేశావా?"

"లేదు. ఇవాళే బుక్ చేయాలి. సాయంత్రం వెళ్తా"

యుద్ధభూమిలో గాయపడ్డ సైనికుణ్ణి చూసినట్లుగా నాకేసి అదోలా చూసి, మారుమాట్లాడకుండా వెళ్లిపోయాడు.

గ్యాస్ కంపెనీకెళ్లాను. తిరుపతిలో సుదర్శనం టోకెన్లకు, ప్రసాదాలకు ఎంత క్యూ ఉంటుందో... అంతుంది. గుండె గుబేల్మంది. మరో పక్క అరుపులు! కేకలు! శాపనార్థాలు! నిబంధనలు! అంతా గజిబిజి గందరగోళం.

నా ముందున్న వ్యక్తితో "బుక్ చేసిన ఎన్నాళ్లకట ఇచ్చేది?'' అన్నాను.

"ఏం పాడో!" కొంచెం విసుగ్గా అన్నాడు.

మరి మాట్లాడించదల్చుకోలేదు. అందరి చేతుల్లో ఏవో కాగితాలున్నాయి. ఏంటవి? ప్చ్...అడిగినా జవాబు చెప్పే స్థితిలో లేరు. ఓ గంటన్నర గడిచింది. కౌంటర్ దగ్గరకెళ్లి నా నంబరు చెప్పాను.

"కాగితాలివ్వండి" అన్నాడు విసుగ్గా.

"కాగితాలేమిటి? నంబరు చెప్పాగా? బుక్ చేసుకోండి"

నన్నోసారి ఎగాదిగా చూశాడు. "ఎంతమందికి చెప్పాలండీ! రోజూ ఎనౌన్సు చేయిస్తూనే ఉన్నాం. గ్యాసు కనెక్షను తీసుకున్నప్పుడు కన్స్యూమర్ రిసీటిచ్చాం కదా. అది పట్రండి, వెళ్లండి"

బిత్తరపోయాను. "ఎప్పుడో ఇరవై ఏళ్ల కిందటి కాగితం, ఇప్పుడెలా దొరుకుతుంది?"

"మా టైం వేస్ట్ చేయకండి! అదుంటే పట్టుకొచ్చి, బుక్ చేయించుకోండి! నెక్స్ట్" అన్నాడు

నన్ను నేను ఖడ్గ తిక్కనతో పోల్చుకున్నాను. ఇంట్లో ఖాళీ సిలిండర్ నన్ను వెక్కిరిస్తున్నట్లుగా అనిపించింది. ఇంటికొచ్చేసరికి మా ఆవిడ కిర్సనాయిలు స్టవ్‌తో కుస్తీపడుతోంది.

"కిర్సనాయిలెక్కడిది?"

నాకేసి ముఖం కూడా తిప్పలేదు మా ఆవిడ. "ఇంటాయన వచ్చెళ్లాడు. కట్టెలపొయ్యి పెట్టేందుకు వీలు లేదుట! బొగ్గుల కుంపటీ వాడకూడదట" అన్నం వడ్డిస్తూ ఓనర్‌గారి ఆంక్షలు వివరించింది.

"అవునూ... మనం గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి ఒరిజినల్ రిసిట్ ఉంటేనే గ్యాసు బుక్‌చేస్తారట. రేపొకసారి తీరికగా వెదుకు. ఎక్కడుందో.."

కత్తివేటు తిన్నట్టుగా చూసింది నావైపు. "ఎన్ని ఇళ్ళు మారాం! ఎక్కడుందది, లేదు! అయినా వాళ్ళిచ్చిన గ్యాస్‌కార్డు బుక్ ఉందిగా" ఆందోళన, చిరాకు, అసహనం అన్నీ కనిపించాయి ఆ నిమిషం మా ఆవిడ ముఖంలో.

"అది చాలదట. ఒరిజినల్ కావాల్ట"

"...." కంచంలో అన్నం కెలుకుతోంది.

'తెల్లారితే ఎలా' అనే భయం వణికిస్తోంది.

"వంటగ్యాసు, ఉల్లిపాయలు, బియ్యం, ఉప్పు, పప్పు, చింతపండు వంటి వాటిపై సమగ్రమైన విధానాలతో అందరికీ అందుబాటులోకి తెచ్చాం. ఇంకా తెస్తున్నాం. మధ్య దళారులను నిరోధిస్తున్నాం. బ్లాక్ మార్కెట్లపై నిఘాలుంచాం. ఇకపై ఎటువంటి కొరతా లేదు. 2010 నాటికి పెట్రోలు డిసెల్ అణుసాంకేతిక రంగాల్లో అంతా సుభిక్షమై, అగ్రదేశాలకు దీటుగా ఎదుగుతామని మంత్రి శ్రీ..." టీవీలో న్యూస్‌రీడర్ ధీటైన స్వరంతో అనర్గళంగా వార్తలు వినిపిస్తున్నాడు.

ఈ మాటలు ఉపన్యాసాలకే పరిమితమా? నిజానికి నగటు మనిషికి కనీసావసరాలు తీరే సదుపాయం కూడా కల్పించరా? మాటలకూ, చేతలకూ ఎక్కడా లంగరందదా? అని ఆవేశంగా పళ్ళు కొరుక్కుంటూనే రేపొద్దున జరుగుబాటెలా అని అంతూదరీ లేకుండా ఆలోచిస్తున్నాను.

✤

ఆరోజు

చెంగ్రావ్ పిలిచినమీదటే వాళ్ళింటికొచ్చాడు కొత్త మిత్రుడు వెంగ్రావ్. కాఫీ, టిఫినూ, బాతాఖానీ అయ్యాక సెలవు తీసుకునేటప్పుడు "ఇరవై రోజుల క్రితం మీ ఇంటికొచ్చినప్పుడు తాగిన కాఫీ ఫస్టుగా వుందోయ్! ఇప్పుడే ఏదోగా..." మొహమాటంతో మాటను పూర్తిచేయలేదు.

"ఆరోజు ఫస్ట్ తారీఖుదా! తేదీలతోపాటు మా ఆవిడ చేసే మర్యాదలూ మారిపోతాయని మరిచాను. నాదే తప్పోయ్!" అన్నాడు చెంగ్రావ్ అపాలజెటిగ్గా.

- శ్రీ కృష్ణవరప్రసాద్

అక్టోబర్ పదహారు ప్రపంచ ఆహార దినోత్సవ సందర్భంగా

















అవీ... ఇవీ

శ్రీ కృష్ణవరప్రసాద్

ఎక్కడ?

ఆఫీసుకు వెళ్ళేందుకు బస్‌స్టాప్‌వైపు నడుస్తున్నారు ఇద్దరు.

ఒకరు: ఈమధ్య సరిగ్గా నిద్రపట్టటం లేదోయ్!

మరొకరు: ఆఫీస్‌లోనా, ఇంట్లోనా?

ఎంత బాగుంటుందీ?!

ఓ పిల్లవాడు: టీచర్లు మనల్ని క్లాసులోంచి కదలనివ్వరు. మాట్లాడుకోనివ్వరు. పైగా పాఠాలు చెప్పి వేధిస్తారు. అది మానేసి గ్రౌండ్‌కి పోయి ఆడుకోండంటే ఎంచక్కా ఎంత బాగుంటుందీ?!

మరో పిల్లవాడు: వాళ్ళకేమీ బాగోదు. వాళ్ళకి మనలా ఆడుకోవటం వచ్చా, ఏమన్నానా? మనకి బోర్‌కొట్టే పాఠాలు చెప్పకుండా కూర్చుంటే వాళ్ళకి బోర్ కొట్టేస్తుంది

వినలేదా?

కట్నం చదువు చదివిస్తున్న తండ్రి కంగారుగా హెచ్చరించాడు కొడుకును "మీ కాలేజిలో ఎవరితోనూ ప్రేమలో పడకురోయ్!"

"పడినా వెంటనే లేస్తాన్లే డాడీ! పడనివాడు కాదు, పడి లేచినవాడే ఘనుడని ఓ సినిమా పాటలో చెప్పారు, నువ్ వినలేదా?" అన్నాడు పుత్రరత్నం.

తెల్సా?

"అయ్యా, ధర్మం" అంటూ దగ్గరికొచ్చిన బిచ్చగాణ్ణి ఎగాదిగా చూశాడు వెంగళ్రావ్.

"నీలో ఏం లోపముందని అడుక్కుంటున్నావ్? శుభ్రంగా ఏదో ఒక పని చేసుకోక ఎందుకీ బిచ్చగాడి బతుకు?" అని కసిరాడు.

"ఇలా వాళ్ళూవీళ్ళూ ఇచ్చిన చచ్చుపుచ్చు ఉచిత సలహాలు వినేసి, అవీఇవీ చేయటం వల్లే చివరికి నాకీ గతి పట్టింది తెల్సా?" బిచ్చగాడూ గొంతు పెంచే అన్నాడు.

ఈ టరమ్‌లోనే...

ఆంజనేయుడికి ఎంత తిన్నా చాల్డంలేదు. అది డబ్బు గనక!

"ఈ లెఖ్ఖన ఎలచ్చను కరుసు ఎన్నాళ్ళకు రాబట్టగలం?" అన్నాడు నిట్టూరుస్తూ నిజాయితీగానే.

"మీరు మొన్న ఎలక్షన్‌కి చేసిన ఖర్చును ఇప్పటికే మూటలు కట్టేసుకున్నారు గదా" ఆశ్చర్యంగా చూశాడు సెక్రటరీ.

"ఎంత వెర్రిబాగులోడివి సెకట్రీ? నేనీ లైఫంతా ఎలచ్చన్లలో నిలబడ్డానికి అవసరమైంది ఈ టరమ్‌లోనే సంపాదించుకోడం గురించి మాట్లాడ్తున్నా" అసలు విషయం బైటపెట్టాడు.

ఏ పని?

యజమాని: (కోపంతో మండిపడ్తూ) ఏరా పోలిగా! నా మాటంటే లెఖ్ఖ లేదా? నేన్చెప్పిన పని వెంటనే చేయమని నీకెన్నిసార్లు చెప్పాల్రా?

నౌకరు: (వంగి వంగి వినమ్రుడై) ఏ పనయ్యగారూ! నిన్న సెప్పిందా? మొన్న సెప్పిందా? అటు మొన్న సెప్పిందా? నేను మరిసేపోయాను గానీ మీరే గుర్తుసేసుకుని మరోమారు సెప్పండి.



మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
పర్సనాలిటీ
డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ :
9849130141

హిప్నో కమలాకర్

మా అమ్మాయికి నాలుగున్నర సంవత్సరాలు. ఇంతవరకూ మాటలు రాలేదు. మలమూత్ర విసర్జనలు ఎక్కువగా చేస్తోంది. ఎప్పుడూ బయటికి వెళ్ళాలని చూస్తూ వుంటుంది. గతంలో రెండు మూడుసార్లు తప్పిపోయి కష్టంమీద దొరికింది. మా అమ్మాయితో ఎలాగో మాకు అర్థం కావటం లేదు. కాస్త తగిన సలహా ఇవ్వండి.

ఎస్. వెంకటేశ్వరరావు, తుని.

మీ అమ్మాయికి గల లక్షణాన్ని 'చైల్డ్‌హుడ్ ఆటిజమ్' అంటారు. ఇదొక మానసిక ఎదుగుదల సమస్య. సాధారణంగా ఇది రెండో సంవత్సరంలోనే మొదలవుతుంది. అయితే, అప్పట్లో మీరు ఈ సమస్య తీవ్రతను గమనించకపోయి వుండాలి. ఏమైనప్పటికీ, ఇది కౌన్సిలింగ్‌తో తీరే సమస్య కాదు. ఏదైనా ఆసుపత్రిలోని మానసిక విభాగంలో పరీక్ష చేయించవలసి వుంటుంది. సమస్య తీరుతెన్నులను సరిగ్గా నిర్ధారణ చేసిన తర్వాత తీసుకోవలసిన వైద్యచర్యలను సూచించటం జరుగుతుంది. ఆ చర్యలను అమలుపరిచే క్రమంలో తల్లిదండ్రులుగా మీకు, బిడ్డతో దగ్గరగా వుండే వ్యక్తులకూ కౌన్సిలింగ్ అవసరమవుతుంది. కాబట్టి వెంటనే దగ్గర్లో వున్న చైల్డ్ సైకియాట్రిస్ట్‌కి చూపించండి.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేవైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ శ్రీ హిప్నోకమలాకర్ తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, ఫ్లాట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

మా వాడి వయసు పది మూడేళ్ళు. ఆరో తరగతి చదువుతున్నాడు. కానీ చదువుపట్ల వాడికెంతో నిరాసక్తత. నోట్సులేవీ సరిగ్గా రాయడు. ఎందులోనూ మార్కులు రావు. అంతేకాదు. వాడి ఈడు పిల్లల్లో కన్పించే హుషారు లేదు. మేమిద్దరం ఉపాధ్యాయులం. అబ్బాయి తీరు చూస్తుంటే చాలా బాధగా వుంటోంది. వైద్యులకు చూపితే 'స్లో లెర్నర్' అన్నారు. వాడి చదువు గురించి మాకు చాలా బెంగగా వుంది. ఇందుకేదైనా పరిష్కారాన్ని సూచించండి.

భారతి, తెనాలి.

సాధారణంగా కొందరు పిల్లలు చాలా నిదానంగా, చాలా నెమ్మదిగా తమ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. చూసేవాళ్ళకు ఈ వయసుకే ఇంత నిరాసక్తత ఎందుకో అనిపిస్తుంది. అయితే మిగతా పిల్లలతో పోలిస్తే చదువు లేదా తెలివితేటల విషయంలో వీళ్లు ఏమాత్రం తీసిపోరు. అయితే మీ అబ్బాయి ఐక్యూ గురించి మీరు ఒకసారి పరీక్ష చేయించటం మంచిది. అతను ఏయే విషయాల్లో హుషారుగా వున్నాడనేది పరీక్షిస్తుండాలి. అతనికి చదువంటే గల నిరాసక్తత గురించి ఆలోచించాలి. ఒకవేళ అతను చదువంటే భయపడుతున్నట్లైతే, మీరు ఉపాధ్యాయులే కాబట్టి అతనికి తగిన రీతిలో చదువుపై ఆసక్తి కలిగేలా చేయాలి. చదువంటే కష్టం అనే భావనను అతని మనసునుండి చెరిపేయాలి. ఆటల్లోనూ, ఇంకా ఇతర పనుల్లోనూ అతను ఉత్సాహం చూపిస్తుంటే వాటిల్లో పాల్గొనేలా చూడాలి. అతను చదువంటే మానసికంగా సంసిద్ధత వ్యక్తం చేసేలా చేయాలి. అంతేకానీ కొట్టడం, తిట్టడం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేకపోగా అతను చదువంటేనే విరక్తి చెందే పరిస్థితి నెలకొంటుంది. కాబట్టి ముందు చదువుపై మానసికంగా ఆసక్తి పెంచుకునేలా చేయాల్సివుంది.

నాకు గత కొంత కాలంగా కీళ్ళనొప్పులు భరించలేనంతగా వస్తున్నాయి. దాంతో నాకెందుకో దాంపత్యజీవితం పట్ల ఆసక్తి తగ్గింది. నాకు కీళ్ళ నొప్పుల కారణంచేతనే సెక్స్ విషయంలో నిరాసక్తంగా మారిపోయానేమోనని అనుమానంగా వుంది. నిజమేనా?

లక్ష్మి, వరంగల్.

కీళ్ళనొప్పులకు, సెక్స్ వాంఛ తగ్గడానికి ఏ విధమైన సంబంధమూ లేనప్పటికీ కీళ్ళనొప్పులతో బాధపడుతున్నప్పుడు ఆ బాధతో సెక్స్‌పట్ల విముఖత చూపించడం జరుగుతూంటుంది. దాంతో అనవసరంగా కోపం, చికాకు, నీరసం పెరిగిపోతాయి. ఏదో తెలియని దిగులు ఆవరించి డిప్రెషన్‌లో పడిపోతారు. మీరు డాక్టర్ని సంప్రదించి తగిన చికిత్స చేయించుకోండి. డిప్రెషన్‌నుంచి బయటపడేందుకు ప్రయత్నించండి.



విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

నానో టెక్నాలజీలో మనమెక్కడ?

ఉరకలు పరుగులతో వస్తోన్న 'సూక్ష్మ సాంకేతికపరిజ్ఞాన' (నానో టెక్నాలజీ) విప్లవం గురించి గతవారం కొద్దిగా చెప్పుకున్నాం. ఈ విప్లవానికి భారతదేశం ఎంత దూరంగా ఉంది లేక ఎంత దగ్గరగా ఉంది అన్న విషయం చెప్పుకోకపోతే మన పరిజ్ఞానం మరీ అసంపూర్ణం అయిపోతుంది.

ఇంటర్‌నెట్ వెబ్‌సైట్లల్లో వెతుకుతుంటే ఈమధ్య కాలంలో 'సూక్ష్మ సాంకేతిక పరిజ్ఞానా'నికి సంబంధించిన అనేక వ్యాపార ప్రకటనలు కనిపిస్తున్నాయి. నానోవరల్డ్ అనే డెన్మార్క్ సంస్థ తమవద్ద 'సూక్ష్మ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఉపరితల రక్షణ ఉత్పత్తులు' దొరుకుతాయని ప్రకటిస్తే, అమెరికాలోని వర్జీనియాకు చెందిన మెటిక్యులమ్ ఇన్స్ అనే సంస్థ తమ వద్ద 'సూక్ష్మ సాంకేతిక నిపుణులు' లభిస్తారని తెలియజేస్తోంది. 'అల్ట్రా-ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్'లో అన్ని రకాల సేవలు అందించగలం అని సింగపూర్‌కు చెందిన 'నానోటెక్నాలజీ మాన్యుఫాక్చరింగ్' అనే సంస్థ ప్రకటిస్తుంది. కాని భారత దేశానికి చెందిన ఒక్క సంస్థకూడా ఇటువంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు కనిపించదు. కారణం, ఈ రంగంలో మనం వెనుకబడి ఉండడమే.

ప్రభుత్వం ప్రకటనల వరకే గాని నిధుల విషయంలో ఈ రంగాన్ని పెద్దగా పట్టించుకోకపోవడం, ప్రయివేటు సంస్థలకు దీనిపై పెద్దగా ఆసక్తి లేకపోవడంతో మొత్తం మీద భవిష్యత్తును ప్రభావితం చేసే ఈ రంగంలో మన దేశం బాగా వెనుకబడి పోయింది. ఈ రంగంపై 2002లో ప్రపంచంలోని అన్ని దేశాలూ కలిపి 200 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తే భారత ప్రభుత్వం అదే సంవత్సరం 40 లక్షల డాలర్లు ఖర్చు చేసింది. అంటే మొత్తం ఖర్చులో 0.2 శాతమన్న మాట. అమెరికా ప్రభుత్వం 2001 తరువాత 'సూక్ష్మ సాంకేతికపరిజ్ఞానా'నికి సంబంధించిన పరిశోధన అభివృద్ధిపై ఖర్చు గణనీయంగా పెంచింది. ఈ రంగంలో అందరికన్నా ముందుండాలన్న ఉద్దేశంతో అది జాతీయ నానో టెక్నాలజీ ఇనిషియేటివ్ అనే పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2001లో ఈ కార్యక్రమానికి 46.4 కోట్ల డాలర్లు ఖర్చు చేసిన అమెరికా 2005 నాటికి ఖర్చును 108 కోట్ల డాలర్లకు పెంచింది. అంటే నాలుగేళ్లలో రెట్టింపు చేసింది.

ఆసియా ఖండంలో చైనా, జపాన్, దక్షిణ కొరియాలు ఈ రంగంపై శ్రద్ధ పెట్టాయి. 2005లో చైనా ఈ రంగంలో పరిశోధనపై 25 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. నానోసైన్సు పరిశోధనలో కూడా భారతదేశం ఇతర దేశాలతో పోలిస్తే చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు మనదేశం ఇప్పటివరకు ఈ రంగంలో 100 పరిశోధనా పత్రాలు వెలువరించగా చైనా ఒక్క ఏడాదిలోనే 200 పత్రాలకు పైగా వెలువరిస్తోంది. నానో స్థాయి ఇంజినీరింగ్, సైన్సు పత్రాల ప్రచురణ శాతాల దృష్ట్యా చూస్తే మొత్తం ప్రపంచంలో వెలువడిన పత్రాల్లో 1990లో చైనా 7.5 శాతం పత్రాలు వెలువరించగా 2004 నాటికి ఇది 18.3 శాతానికి పెరిగింది. 'సూక్ష్మ సాంకేతికరంగం'లో మనదేశ పరిస్థితి గురించి తెలుసుకోడానికి ఈ వివరాలు ఉపయోగపడతాయి.

అయితే పరిస్థితి అంతా నిరాశాజనకంగా లేదు. ఇటీవలి కాలంలో మనదేశంలో కూడా ఈ రంగంలో పరిశోధనలు పెరుగుతున్నాయి. 2001లో దేశంలో 'నానో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనీషియేటివ్' పేరుతో కార్యక్రమం ప్రారంభించబడింది. కాని ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు ఖర్చు చేసింది సుమారు వందకోట్ల రూపాయలు మాత్రమే. మనదేశంలో కూడా విద్యార్థులు ఇటీవలి కాలంలో ఈ రంగంపై ఆసక్తి చూపుతున్నారు. కానీ వారికి శిక్షణ ఇవ్వడానికి కావలసిన పరికరాలు లేవు. 'మొదట్లో ఇటువంటి ఇబ్బందులున్నా ఇటీవలి కాలంలో ఈ రంగంలో నిపుణులు పెరగడానికి అవకాశాలు మెరుగయ్యాయి' అని బెంగుళూరులోని ఐఐటి ప్రొఫెసర్ అజయ్ మసూద్ చెప్పారు. ఒక నానోమీటర్ వ్యాసం గల సూక్ష్మాతిసూక్ష్మ వస్తువులను చూడగలిగే 'అటామిక్ ఫోర్స్ మైక్రోస్కోపు'లూ, ఇతర పరికరాలూ కొన్ని సంస్థల్లో లభ్యమవుతున్నాయని చెప్పారు. అయితే ఇప్పటికీ అంత సూక్ష్మ పరికరాలను ఖచ్చితంగా కొలవగలిగే పరికరాల కొరత ఉండనే ఉందని నిపుణులు చెబుతున్నారు.

నిధుల కొరతను అధిగమించే పేరుతో మన ప్రభుత్వం ఈ రంగంలో ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోంది. కాని అక్కడ కూడా ఫలితాలు పెద్ద ఆశాజనకంగా లేవు. మానవ శరీరంలో ఏ భాగానికి కావాలంటే ఆ భాగానికి మాత్రమే వెళ్లి పనిచేయగల మందులను నానోటెక్నాలజీతో తయారుచేయడం కోసం ఇటీవల రెండు ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కొన్ని ఇతర దేశాలతో ముఖ్యంగా జర్మనీ, ఇటలీ, అమెరికా, తైవాన్‌లతో కలిసి ఈ రంగంలో మన నిపుణులు కొంత పరిశోధనా కృషి చేపట్టారు. బెంగుళూరులో ఈ రంగంలో మంచి పరిశోధన సాగుతోంది. ముఖ్యంగా కార్బన్ నానోట్యూబ్‌లూ, మంచి నీరు, గాలిని శుభ్రం చేసే నానోపొడర్లూ తయారుచేసేందుకు గట్టి కృషి జరుగుతోంది. ఇప్పటికే ఈ పరిశోధనాలయాల నుండి నాలుగు రకాల నానో ఉత్పత్తులు పారిశ్రామిక రంగానికి బదలాయించబడ్డాయి. వాటిలో వెండి నానోపార్టికిల్స్‌ను ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల్లో మంచి నీరు శుభ్రం చేసే వ్యవస్థ కూడా ఉంది. నానోపౌడర్‌తో కూడిన కోటింగ్ పదార్థాలు కూడా తయారయ్యాయి. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఉత్పన్నమౌతున్న వాటితో పోలిస్తే మనదేశంలో అవుతున్న నానో ఉత్పత్తులు చాలాచాలా తక్కువ. ఈ రంగంపై అటు ప్రభుత్వమూ, పరిశోధనాశాలలూ మరింత శ్రద్ధ పెట్టాల్సి ఉంది.

2004లో మన రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ 'సూక్ష్మ సాంకేతికపరిజ్ఞానం'పై పరిశోధనను ముందుకు తీసుకుపోయేందుకు నానోసైన్సు నిపుణులతో ఒక జాతీయ సమావేశం నిర్వహించారు. అక్కడ ఒక జాతీయ స్థాయి కార్యక్రమాన్ని కూడా రూపొందించారు. రానున్న అయిదేళ్ల కాలంలో ఈ రంగంపై ఏడాదికి 100 కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేయాలని ఈ కార్యక్రమంలో సిఫార్సు చేశారు. దేశ వ్యాప్తంగా పది మినీ నానో పరిశోధనా కేంద్రాలు నెలకొల్పాలని కూడా సూచించారు. ప్రతి కేంద్రానికీ సుమారు 20 కోట్ల రూపాయలు కేటాయించి నానోసైన్సుకు చెందిన ఒకటో రెండో నిర్దిష్ట విషయాలపై పరిశోధనా కార్యక్రమాలను అప్పగించాలని నిర్ణయించారు. 11వ పంచవర్ష ప్రణాళికలో ఈ రంగంలో 900 కోట్ల రూపాయలు (సుమారు 20 కోట్ల డాలర్లు) ఖర్చు చేయాలని నిర్ణయించారు. ప్రణాళికా సంఘం ఈ ఖర్చుకు ఆమోదించింది. కాని చైనా ఒక్క 2005లోనే ఖర్చు చేసిన 25 కోట్ల డాలర్లు (సుమారు 1125 కోట్ల రూపాయలు)తో పోలిస్తే, అమెరికా 2005లో ఖర్చు చేసిన 108 కోట్ల డాలర్లతో (సుమారు 4850 కోట్ల రూపాయలు) పోలిస్తే మనం చేసే ఖర్చు చాలాచాలా తక్కువ. కొద్ది కాలంలో ప్రపంచంలో విప్లవాత్మక మార్పులు తేనున్నదనుకున్న 'సూక్ష్మ సాంకేతికపరిజ్ఞానం'పై ఇప్పుడు ఎంత ఖర్చు చేస్తే, అంతగా ఫలితాలు వస్తాయి. లేకుంటే ఇతర దేశాలతో మనకున్న అంతరం మరింత పెరిగిపోతుంది. ✤

కొత్త పుస్తకాలు

మీరు - మీ హక్కులు



జీవితంలో ఏదైనా జటిలమైన సమస్య ఎదురైతే తప్ప లాయర్లు, కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం కలగదు. కానీ అలాంటి అవాంఛనీయాలేం జరక్కపోయినా హక్కులు, చట్టాలకు సంబంధించి ఎన్నో సందేహాలుంటాయి. వాటిని నివృత్తి చేసుకోడానికి ఎవరిని అడగాలో తెలీక సతమతమవుతుంటాం. అలాగే సమాజంలో అందరూ తెలుసుకోవాల్సిన ఫండమెంటల్ రూల్స్ కొన్ని వుంటాయి. అవి తెలీకపోతే చాలాసార్లు మోసపోయే లేదా చులకనకు గురయ్యే అవకాశం వుంది. కనుక ఈ బేసిక్ విషయాలు, నియమాలను ఉల్లంఘిస్తే జరిగే అనర్థాలను తెలుసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించే పత్రికల్లో ప్రశ్నలకు సమాధానాలు ఇప్పిస్తుంటారు. ఇలాంటివి అడపాదడపా చదివినా మొత్తం వంద ప్రశ్నలు, సమాధానాలను కలిపి ఓ పుస్తకంగా అందించడంవల్ల ఏకబిగిన ఎన్నో విషయాలను తెలుసుకునే వీలు కలిగింది. ఈ ప్రశ్నలను మొత్తం ఇరవై అధ్యాయాలకింద విభజించారు. ఇందులో చట్టం అంటే ఏమిటి దగ్గర్నుంచి, సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, మన ప్రాథమిక హక్కులు, ఓటు హక్కు, పోలీసులు, అరెస్టు వారెంటు, బెయిలు సంపాదించుకోవడం, ఆస్తి హక్కు, అద్దె నియమాలు, వినియోగదార్ల హక్కులు, రోగుల హక్కులు, కార్మిక హక్కులు, లైంగిక వేధింపులు, వీలునామా, పరువు నష్టం, ప్రజల విధులు, బాధ్యతలు - ఇలా న్యాయ వ్యవస్థకు సంబంధించిన అన్ని విషయాలనూ అరటిపండు ఒలిచి నోటికి అందించిన చందంగా వివరించారు. సులువైన భాషలో వున్న ఈ పుస్తకం ఉపయోగకరమైంది.

మీరు - మీ హక్కులు ప్రశ్నలు - సమాధానాలు
డాక్టర్ సి.వి. నరసింహారెడ్డి, వెల : 50/-, పేజీలు :108
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని షాపులలో...

- రతన్

మానస సరోవరం
(కవితాగేయ సంపుటి)
గజనన్ తామన్
పేజీలు : 100
ప్రతులకు :
శ్రీ సీతారామ సేవాసదన్
తమ్మి చెరువుకట్ట, మంథని -505 184
కరీంనగర్.

పుష్పరాగాలు (నానీలు)
కోపూరి పుష్పాదేవి
వెల : 40/- పేజీలు : 65
ప్రతులకు :
విశాలాంధ్ర బుక్ హౌస్
కోపూరి రామచంద్రరావు, 6-12-16,
జయరామ్ వీధి, టేసర్‌పేట,
కె.టి. రోడ్, విజయవాడ-520 001.

ముస్లింల మనసుల్లోని సంక్షోభం-ఖిబ్లా

భారతదేశంలోని మెజారిటీ మతఛాందస శక్తుల కారణంగా మైనారిటీ వర్గాల్లో అభద్రత ఏర్పడి అది అనేక రూపాలుగా వ్యక్తమవుతోంది. దీన్ని అవకాశంగా తీసుకుని మతఛాందసత్వాన్ని మరింత రెచ్చగొట్టే హింసాత్మక ధోరుణులకు పాల్పడుతున్నాయి. ఈ రెండు అసహజత్వాల మధ్య రెండు మతాలకు చెందిన సాధారణ ప్రజలు ముఖ్యంగా మైనారిటీ వర్గం సంక్షోభాన్ని ఎదుర్కొంటోన్న సందర్భం ప్రస్తుతం మనముందుంది. ఈ క్రమంలో తెలుగు సాహిత్యంలో ముస్లింల జీవన స్థితిగతులకు అద్దంపట్టే విధంగా మైనారిటీ రచయితల సాహిత్య సృజన ప్రతిభావంతంగా వెలువడుతోంది. తెలుగు సాహిత్యంలో ముస్లింమైనారిటీవాద రచయితల మధ్య ఇటీవల ముస్లింవాదం, ఇస్లాంవాదం అనే రెండు ధోరుణుల గురించిన వాదనలు కొనసాగుతూ వాటి రూపాలకు నిర్దిష్టత ఏర్పడే దిశగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రెండు ధోరుణులను అనుసరించి రెండు కవితా సంపుటాలు వచ్చాయి. వాటిలో ఇస్లాంవాదాన్ని బలపరుస్తూ వెలువడిన కవితా సంకలనం ఈ ఖిబ్లా. తెలుగు సాహిత్య ధోరుణులను అధ్యయనం చేస్తోన్న ముస్లింలకూ, ముస్లిమేతరులకూ కూడా ముస్లింల జీవనంపట్ల ఆయా దృక్పథాల పట్ల స్పష్టతకు ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. అయితే కేవలం మైనారిటీ వర్గంగా సమస్యలపై ఉద్యమించాలనే భావాన్ని ఈ కవితా సంపుటి కలిగిస్తుంది. అది కూడా ఇస్లాం బోధనల సారాంశాన్ని ప్రాతిపదికగా భావిస్తుంది. ఈ పునాదితో ఒక సామరస్య శాంతియుత జీవనాన్ని ప్రజాస్వామిక లౌకిక దృక్పథం కలిగిన అన్ని వర్గాల ప్రజలతో విస్తృత రూపంలో ఉద్యమ నిర్మాణం కుదరని పని. ఇకపోతే ఈ సంకలనంలోని కవితలన్నీ శక్తివంతంగా పాఠకుడిలో అనుభూతి, ఆలోచనల బీజాలు వేసేవే. పైన చెప్పిన రెండు ధోరుణులకు 'మా చుట్టూ వృత్తాల్ని చుడుతున్నాయి/ మాతో నిమిత్తం లేకుండా/ మమ్మల్ని-మా అభిప్రాయాల్ని హైజాక్ చేస్తున్నాయి' ప్రాతినిధ్యం వహించే కవిత ఇది. మరో చోట 'కౌన్..రే...వో?/ అల్లాః ప్రసాదించిన స్వేచ్ఛపై/ కత్తెర్లు వేసే పురుషాహంకారి/ నా చుట్టూ నాల్గు గోడల సమాధిని/ నిర్మించే ఛాందన బేహారి' అంటూ ఛాందసత్వాన్ని ప్రబోధించే మత ప్రతినిధులను ప్రశ్నించే కవితలు ఈ పుస్తకంలో చోటుచేసుకున్నాయి. ఇవి చక్కటి ప్రతీకలు. పదచిత్రాలతో కూడిన ఈ పుస్తకంలోని కవిత్వమంతా ఒకరకమైన ఉద్వేగాన్ని పాఠకుడిలో కలిగిస్తుంది. దాదాహయత్, స్మైల్, దేవీప్రియ, అఫ్సర్, షేక్‌కరీముల్లా, షహనాజ్, అన్వర్, షమీవుల్లా, సలీం, ఎ.రాజాహుస్సేన్, ఖాలీదా పర్వీన్ తదితరుల కవితలు బలంగా తమ గొంతులను వినిపించాయి. ఇది అందరూ చదవదగ్గ పుస్తకం.



(ఖిబ్లా కవితా సంకలనం, సంపాదకులు: యం.డి. ఉస్మాన్ ఖాన్, యస్.ఏ.అజాద్, సయ్యద్ సాబిర్ హుసేన్, సయ్యద్ అమీర్, షేక్ కరీముల్లా పేజీలు: 104, వెల:30/-, ప్రతులకు: షేక్ కరీముల్లా, డో.నెం. 21-36, పెద్దమసీదు బజార్, వినుకొండ-522 647, గుంటూరు జిల్లా ప్రజాశక్తి, విశాలాంధ్ర,తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, అజాద్ హౌజ్ ఆఫ్ పబ్లికేషన్స్.

- వీరప్రసాద్

టొమేటో బాత్

కావలసిన పదార్థాలు

బియ్యం	:	రెండు కప్పులు
టొమేటో ముక్కలు	:	రెండు కప్పులు
ఉల్లితరుగు	:	ఒక కప్పు
పచ్చిమిర్చి	:	రెండు స్పూన్‌లు
కొత్తిమీర	:	పావు కప్పు
అల్లం వెల్లుల్లి	:	ఒక స్పూన్
లవంగాలు	:	నాలుగు
యాలకులపొడి	:	అర స్పూన్
పసుపు	:	చిటికెడు
దాల్చిన చెక్క పొడి	:	పావు స్పూన్
నూనె	:	తగినంత
ఉప్పు	:	తగినంత

తయారు చేసే పద్ధతి

బియ్యాన్ని బాగా కడిగి నీరు తీసేసి పక్కన పెట్టుకోవాలి. తరువాత గిన్నెలో నూనె వేసి కాగాక కొత్తిమీర, ఉప్పు తప్ప మిగతావన్ని వేసి వేయించి, బియ్యం కూడా వేసి వేయించాలి సిమ్‌లో ఉడికించుకోవాలి, అయిన తరువాత కొత్తిమీర చల్లుకుని దించుకోవాలి.



రుచి

టొమేటో సూప్

కావలసిన పదార్థాలు

టొమేటోలు పండినవి	:	అరకేజీ
ఉల్లిపాయ ముక్కలు	:	ఒక కప్పు
ధనియాల పొడి	:	ఒక స్పూన్
మిరియాల పొడి	:	ఒక స్పూన్
కరివేపాకు	:	రెండు రెబ్బలు
లవంగాలు	:	నాలుగు
దాల్చిన చెక్క	:	అర స్పూన్
ఉప్పు	:	తగినంత
నీళ్ళు	:	ఎనమిది కప్పులు
మైదాపిండి	:	ఒక స్పూన్

తయారు చేసే పద్ధతి

ఓ గిన్నెలోకి నీరు తీసుకుని దీనిలో టొమేటోముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేసి ఉడికించుకోవాలి. ఇవి ఉడుకుతుండగా ధనియాలపొడి, మిరియాలపొడి, లవంగాలు, దాల్చిన చెక్క కొద్దిగా వేయించి వేయాలి. ఉప్పువేసి బాగా మరిగించి కరివేపాకు వేసి కొద్దిసేపు వుంచి దించే ముందు మైదాపిండిలో నీరుకలిపి పేస్ట్‌లా చేసి మరుగుతున్న సూప్‌లో కలపాలి. ఇది వేడిగా తీసుకుంటే రుచిగా వుండటమే కాక జీర్ణశక్తిని కూడా పెంచుతుంది.

– జ్యోతి, ఖమ్మం



ఆదర్శం

పి.ఎం.సుందరరావు

కిరణ్ తెలివైనవాడు. నలుగురితో స్నేహంగా ఉంటాడు. రామాపురంలోని హైస్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. చదువులో, ఆటపాటల్లో ఫస్ట్. అందుకే వాడంటే తోటి విద్యార్థులతోపాటు టీచర్లందరికీ ఎంతో ఇష్టం.

కిరణ్ తండ్రి రాజారావు ఆ ఊరి సర్పంచ్. ఓ రోజు కొందరు గ్రామస్తులు ఆయన దగ్గరకొచ్చి, "రాజారావుగారూ! పట్నం నుండి మన ఊళ్లోకి వచ్చే రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దాన్ని బాగు చేయిస్తే ప్రజలందరికీ సౌకర్యంగా ఉంటుంది" అని చెప్పారు.

దానికాయన, "మన గ్రామానికి ఇంకా నిధులు విడుదల కాలేదు. డబ్బుల్లేకుండా నేనేం చేయగలను?" అని చెప్పి పంపేశాడు. వరండాలోనే కూర్చొని చదువుకుంటున్న కిరణ్ ఆ మాటలు విన్నాడు. అంతకముందు రోజే నిధులు మంజూరయ్యాయని నాన్న అమ్మతో చెప్తుంటే కిరణ్ విన్నాడు.

"నాన్నకు రోడ్డు బాగు చేయించటం ఇష్టంలేదనుకుంటా. లేకపోతే అబద్ధం ఎందుకు చెప్తాడు? ఎలాగైనా నాన్న మనసు మార్చి రోడ్డు బాగు చేయించాలి' అని నిర్ణయించుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం నౌకరు వీరయ్య కొన్ని జామకాయలు తీసుకొచ్చాడు. వాటిలో ఒకటి తీసుకుని తినబోయాడు కిరణ్.

రాజారావు అది చూసి, "ఒరేయ్ కిరణ్! ఆ కాయ తినకు. అది కుళ్లిపోయినట్టుంది. పనికిరాని కాయ తినడమెందుకు? మంచి కాయ తిను" అన్నాడు.

అప్పుడు కిరణ్ "మీరు చెప్పింది నిజమే నాన్నా! పనికిరాని కాయల్ని ఎవరూ తినరు. పారేస్తారు. అలాగే జనానికి ఉపయోగపడని వాళ్లను కూడా ఇంకోసారి ఎన్నుకోరు. అందుకే మంచి పనులు చేసి, ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోండి" అన్నాడు.

కొడుకు దేని గురించి ఆ మాట అన్నాడో రాజారావు గ్రహించాడు. "పెద్దవాళ్ల విషయాల్లో జోక్యం చేసుకోకు" అని కిరణ్‌ని మందలించాడు రాజారావు.

కానీ కిరణ్ ఆ విషయాన్ని అంతటితో వదిలిపెట్టలేదు. తన స్కూలు విద్యార్థులందర్నీ సమావేశపర్చి, "మనందరి శ్రమదానంతో మన ఊళ్లోని ప్రధాన రహదారిని బాగుచేద్దాం!" అని చెప్పాడు. విద్యార్థులందరూ సరేనన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో రోజూ రెండు గంటలపాటు బడి పిల్లలంతా శ్రమించారు. నెల రోజుల్లోనే రోడ్డును బాగుచేశారు.

ఈ విషయం ఆ జిల్లా కలెక్టరుకు తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రామాపురం హైస్కూలుకి కలెక్టరు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థుల సహకారంతో రోడ్డు బాగు చేయించిన కిరణ్‌ను అభినందించారు. మెమెంటో కూడా బహూకరించారు. అదే వేదిక మీద వున్న రాజారావు తన తప్పు తెలుసుకున్నాడు.

మైకు ముందుకొచ్చి, "ముందుగా అందరూ నన్ను క్షమించండి. గ్రామ సర్పంచ్‌గా ఆ పని నేను చేయాల్సింది. కానీ నా బాధ్యతను నేను విస్మరించాను. నా కొడుకే ఈ గొప్ప పని పూర్తి చేశాడు. కొంతమంది పెద్దల్ని పిల్లలు ఆదర్శంగా తీసుకుంటారు. కాని నేను నా కొడుకును ఆదర్శంగా తీసుకుంటున్నాను. ఇకమీదట ఏ పనైనా నేనే స్వయంగా చేయిస్తాను. మీరు ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైనా వుంటే నా దృష్టికి తీసుకురండి. నేను వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తాను" అని చెప్పాడు.

తండ్రిలో వచ్చిన మార్పుకు కిరణ్ ఎంతో సంతోషించాడు. కిరణ్ చేసిన మంచిపని రాజారావులో మార్పు తీసుకొచ్చినందుకు అతణ్ణి కలెక్టర్‌తోపాటు గ్రామస్తులందరూ అభినందించారు.